TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ

ఎడిటర్ పి. రాజేష్ తెలుగు దినపత్రిక

Published from Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Khammam | సంపుటి : 2 | సంచిక : 76 | పేజీలు : 8 | మంగళవారం 28 ఆగస్టు 2024 | వెల : 4/-

## భారత్ సంపూర్ణ మద్దతు

- ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య కీలక చర్చలు
- "అధ్యక్షుడు పుతిన్‌తో ఈ రోజు మాట్లాడాను
- ఇరుదేశాల మధ్య ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడుకున్నాం
- రష్యా-ఉక్రెయిన్ వివాదంతో పాటు ఇటీవలే నేను ఉక్రెయిన్‌లో పర్యటించడంతో నా ఆలోచనలను కూడా పంచుకున్నాను.
- అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ చర్చపై కేంద్ర ప్రభుత్వం కూడా ఒక ప్రత్యేక ప్రకటన విడుదల



## కేజ్రీవాల్‌కు దక్కని ఊరట...



- సెప్టెంబర్ 3 వరకూ జ్యుడిషియల్ కస్టడీ పొడిగింపు
- సీబీఐ దాఖలు చేసిన నాల్గవ ఛార్జిషీటుపై నిర్ణయాన్ని కూడా రౌస్ ఎవెన్యూ కోర్టు రిజర్వ్
- బెయిలు కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సెప్టెంబర్ 5వ తేదీకి వాయిదా




## హైడ్రా కూల్చివేతలకు అడ్డొస్తే బుల్డోజర్ ఎక్కించాలి

- బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు సమర్థన
- హైడ్రా విషయంలో ఇటీవల ప్రభుత్వ అనుకూల వ్యాఖ్యలు చేస్తున్న మెదక్ బీజేపీ ఎంపీ
- హైడ్రా విషయంలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవద్దని సూచన
- అక్రమమని తేలితే ప్రభుత్వ కార్యాలయమైనా కూల్చేయాల్సిందేనని వ్యాఖ్యలు
- పేదల జోలికి వస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరిక

## ఎమ్మెల్సీ కవితకు బెయిల్

- కవిత బెయిల్ బాండ్స్ అంగీకరించిన రౌస్ అవెన్యూ కోర్టు... రిలీజ్ ఆర్డర్స్ జారీ
- కవితకు పూచీకత్తు బాండ్లను సమర్పించిన భర్త, ఎంపీ రవిచంద్ర
- కవితను విడుదల చేయాలని రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు
- ఒక్కో కేసులో రూ.10 లక్షల చొప్పున బాండ్ సమర్పించాలన్న సుప్రీంకోర్టు
- ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్
- బెయిల్ పిటిషన్‌పై గంటన్నర పాటు సాగిన వాదనలు
- ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ బెయిల్
- పాస్‌పోర్టును మెజిస్ట్రేట్‌కు సరెండర్ చేయాలన్న కోర్టు
- కేసు ట్రయల్‌కు సహకరించాలని స్పష్టీకరణ



ఢిల్లీ

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు రిలీజ్ ఆర్డర్స్ ఇచ్చింది. కవిత పూచీకత్తు బాండ్లను రౌస్ అవెన్యూ కోర్టు అంగీకరించింది. కవితకు పూచికత్తు బాండ్లను భర్త అనిల్ కుమార్, ఎంపీ రవిచంద్ర ఇచ్చారు. ఆ తర్వాత కవితను విడుదల చేయాలని రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అంతకుముందు సుప్రీంకోర్టు కవితకు బెయిల్ ఇస్తూ తీర్పు చెప్పింది. బెయిల్ అనంతరం ట్రయల్ ప్రొసీడింగ్స్‌కు క్రమం తప్పకుండా హాజరు కావాలని, త్వరితగతిన విచారణకు సహకరించాలని కవితకు జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. సీబీఐ, ఈడీ కేసులలో ఒక్కో కేసుకు సంబంధించి రూ.10 లక్షల చొప్పున బాండ్ సమర్పించాలని కవితను సుప్రీం కోర్టు ఆదేశించంది. సాక్ష్యాధారాలను తారుమారు చేయడానికి లేదా సాక్షులను ప్రభావితం చేయడానికి ఎలాంటి ప్రయత్నం చేయకూడదని సూచించింది. ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి - మిగతా3లో



## కవితకు బెయిల్ ఇప్పించిన కాంగ్రెస్‌కు అభినందనలు!

- కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ న్యాయవాదులకు బండి సంజయ్ అభినందనలు
- మీ అలుపెరగని ప్రయత్నాలు ఫలించాయంటూ చురక
- ఈ బెయిల్ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల విజయమన్న బండి సంజయ్

ఢిల్లీ

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో తీహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడంపై కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ స్పందించారు. కవితకు బెయిల్ లభించినందుకు కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ న్యాయవాదులకు అభినందనలు తెలిపారు. మీ అలుపెరగని ప్రయత్నాలు చివరకు ఫలించాయని చురక అంటించారు. ఈ బెయిల్ బీఆర్ఎస్, కాంగ్రెస్... రెండు పార్టీల విజయమని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నాయకురాలు బెయిల్‌పై బయటకు - మిగతా3లో

## 10 రోజుల పాటు ప్రజాపాలన

- తెలంగాణ సర్కార్ మరో కీలక నిర్ణయం..
- రాష్ట్రంలో ప్రతిఒక్కరికి హెల్త్ కార్డులు
- అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.
- ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్‌కు తరలించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం
- ఆస్పత్రి నిర్మాణానికి ఆర్కిటెక్ట్స్‌తో డిజైన్లు రూపొందించాలి
- వచ్చే 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకుని ఆస్పత్రిని నిర్మించాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించిన సర్కార్.. ఇప్పుడు మరో దరఫా ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమైంది. రేషన్ కార్డు, హెల్త్ కార్డుల కోసం వివరాలు సేకరించనుంది. పూర్తి హెల్త్ ప్రొఫైల్‌తో రాష్ట్రంలో ప్రతి పౌరుడికి హెల్త్ కార్డు మంజూరు చేయాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో అధికారులను సన్నద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. కాగా, మంగళవారం నాడు స్పీడ్(స్మార్ట్ ప్రోయాక్టీవ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ)పై అధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో అధికారులకు సీఎం కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి పది రోజుల పాటు మరోసారి ప్రజాపాలన కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే, హైదరాబాద్ లోని ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్‌కు తరలించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇందుకు సంబంధించి భూ బదలాయింపు కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆస్పత్రి నిర్మాణానికి ఆర్కిటెక్ట్స్‌తో డిజైన్లు రూపొందించాలన్నారు. - మిగతా3లో



## ఆదివాసీలు, గిరిజనులు అన్ని రంగాల్లో ముందుండాలి

- ఆదివాసీ, గిరిజన గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలి
- ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలతో గిరిజనులు ఆదివాసీలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి
- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

ములుగు

ఆధునిక సమాజంలో ఆదివాసీలు గిరిజనులను భాగస్వాములు చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఆదివాసీ, గిరిజన గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. మంగళవారం గవర్నర్ ములుగు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. తాను గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించాక తొలి పర్యట నగా షెడ్యూల్ ప్రాంతమైన - మిగతా3లో

# భారత్ సంపూర్ణ మద్దతు



**న్యూఢిల్లీ:** భారత్‌కు మిత్ర దేశమైన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ (మంగళవారం) మాట్లాడారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ఇటీవల ముగిసిన ప్రధాని మోదీ ఉక్రెయిన్ పర్యటనపై కూడా చర్చించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా ప్రకటించారు. " అధ్యక్షుడు పుతిన్‌తో ఈ రోజు మాట్లాడాను. ఇరుదేశాల మధ్య ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడుకున్నాం. రష్యా-ఉక్రెయిన్ వివాదంతో పాటు ఇటీవలే నేను ఉక్రెయిన్‌లో పర్యటించడంతో నా ఆలోచనలను కూడా పంచుకున్నాను. ఈ వివాదాన్ని శాంతియుత, వీలైనంత త్వరగా పరిష్కరించుకునేందుకు భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని నేను పునరుద్ఘాటించాను" అని మోదీ వివరించారు. ఈ మేరకు ఈ రోజు ఇరువురూ ఫోన్‌లో సంభాషించుకున్నారు. అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ చర్చపై కేంద్ర ప్రభుత్వం కూడా ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేసింది. భారత్-రష్యా మధ్య 22వ ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు గత నెలలో ముగిసిన తన రష్యా పర్యటనను ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారని తెలిపింది. ఇరువురు నేతలు పలు ద్వైపాక్షిక అంశాల్లో పురోగతిని సమీక్షించారని వివరించింది. భారత్, రష్యా మధ్య ప్రత్యేకమైన, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడుకున్నారని వివరించింది. పరస్పర ప్రయోజనకరమైన ప్రాంతీయ, అంతర్జాతీయ సవాళ్లపై అభిప్రాయాలను కూడా పంచుకున్నారని ప్రకటనలో కేంద్రం పేర్కొంది. మరోవైపు ఎడతెగకుండా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ వివాదంపై ఇరువురు నాయకులు అభిప్రాయాలు పంచుకున్నారని ప్రకటనలో కేంద్రం వెల్లడించింది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తన ఉక్రెయిన్ పర్యటనకు సంబంధించిన తన ఆలోచనలను పుతిన్‌తో పంచుకున్నారు. సంబంధిత భాగస్వాములు అందరూ శాంతికి కట్టుబడి ఆచరణాత్మక చర్చలు జరపాలని మోదీ సూచించారు. కాగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ మధ్య ఉక్రెయిన్‌లో పర్యటించారు. రష్యాతో వివాదంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ చట్టాలకు లోబడి సహకారానికి సంసిద్ధమంటూ ఇరుదేశాధినేతలు అంగీకరించారని ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే.

## 12 గంటల బెంగాల్ బంద్‌కు బీజేపీ పిలుపు



**కోల్‌కతా:** ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో జూనియర్ వైద్యురాలిపై అత్యచారం, హత్యకు నిరసనగా బుధవారంనాడు 12 గంటల బెంగాల్ బంద్‌కు భారతీయ జనతా పార్టీ పిలుపునిచ్చింది. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ బంద్ జరుపనున్నట్టు తెలిపింది. మంగళవారంనాడు జరిగిన 'నబన్నా అభియాన్' ర్యాలీలో చెలరేగిన హింసాకాండకు మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ ప్రభుత్వాన్ని రాష్ట్ర బీజేపీ నేత సువేందు అధికారి తప్పుపట్టారు. బెంగాల్ నిరసనలకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**రాష్ట్రపతి పాలనకు డిమాండ్**

విద్యార్థి సంఘాలు మంగళవారంనాడు చేపట్టిన నిరసల నేపథ్యంలో చోటేచేసుకున్న హింసకు మమతా బెనర్జీ బాధ్యత వహించాలని, బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని సువేందు అధికారి డిమాండ్ చేశారు. ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసుతో ప్రమేయమున్న వారిని కాపాడేందుకు మమతా బెనర్జీ ప్రయత్ని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మమతను నియంతగా పోలుస్తూ, ఈ ఘటనపై నిష్పాక్షిక దర్యాప్తు జరగాలంటే సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. తొలుత ఈ ఘటనను ఆత్మహత్యగా టీఎంసీ పేర్కొన్నందున మమతా బెనర్జీ, పోలీస్ కమిషనర్ వినీత్ గోయెల్‌కు కూడా సీబీఐ పాలీగ్రాఫ్ టెస్ట్ జరపాలన్నారు. కాగా, మహిళలకు భద్రత కరువుతోందని, ఇందుకు మమతా బెనర్జీ బాధ్యత వహించాలంటూ విద్యార్థి సంఘం 'ఛాత్రసమాజ్', రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 'సంగ్రామి జౌత మంచా' మంగళవారంనాడు 'నబన్నా అభియాన్' పేరుతో నిరసనల ర్యాలీలు చేపట్టింది. నార్త్ కోల్‌కతాలోని కాలేజీ స్క్వేర్ నుంచి ఒక ర్యాలీ, హౌరాలోని సాంత్రాగచి నుంచి మరో ర్యాలీ నిర్వహించింది. ఆందోళనకారులను అడ్డుకునేందుకు పెద్ద ఎత్తున మోహరించిన పోలీసు బలగాలు వాటర్ కేనన్లు, భాష్పవాయువు ప్రయోగించడంతో ర్యాలీలో ఉద్రికత చోటుచేసుకుంది.

## కేజ్రీవాల్‌కు దక్కని ఊరట...



న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ పాలసీకి సీబీఐ నమోదు చేసిన కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఎలాంటి ఊరట దక్కలేదు. కేజ్రీవాల్ జ్యుడిషియల్ కస్టడీని సెప్టెంబర్ 3న తేదీ వరకూ రౌస్ ఎవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా మంగళవారంనాడు పొడిగించారు. ఇంతకుముందు విధించిన కస్టడీ గడువు నేటితో ముగియడంతో కేజ్రీవాల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరుపరిచారు.

సీబీఐ దాఖలు చేసిన నాల్గవ ఛార్జిషీటుపై నిర్ణయాన్ని కూడా రౌస్ ఎవెన్యూ కోర్టు రిజర్వ్ చేసింది. ఈ ఛార్జిషీటులో కేజ్రీవాల్, మరో ఐదుగురి పేర్లను సీబీఐ చేర్చింది. సెప్టెంబర్ 3న దీనిపై కోర్టు విచారణ జరపనుంది. సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్న ఎక్సైజ్ పాలసీ స్కామ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్నారు.

కాగా, ఎక్సైజ్ పాలసీ కేసులో బెయిలు కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సెప్టెంబర్ 5వ తేదీకి సుప్రీంకోర్టు ఇంతకుముందు వాయిదా వేసింది. అఫిడవిట్ సమర్పించేందుకు మరింత గడువు కావాలని సీబీఐ కోరడంతో అత్యున్నత న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. కేజ్రీవాల్ తనకు బెయిల్ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ ఒక పిటిషన్, సీబీఐ అరెస్టుకు వ్యతిరేకంగా మరో పిటిషన్ వేసారు. అయితే సీబీఐ తమ సమగ్ర అఫిడవిట్‌లో ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన కీలక నిర్ణయాలన్నీ కేజ్రీవాల్ డైరెక్షన్‌లో నాటి ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతో కలిసి తీసుకున్నవేనని సీబీఐ ఆరోపణగా ఉంది. అయితే ఈ ఆరోపణలను ఆప్ తోసిపుచ్చుతూ కేజ్రీవాల్‌ను జైలులోనే ఉంచేందుకు బీజేపీ, సీబీఐ కుట్రపన్నుతున్నాయని చెబుతోంది.

## బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలిగా మరోసారి మాయావతి..

### ఏకగ్రీవంగా ఎన్నిక

బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలుగా మరోసారి మాయావతి ఎన్నికయ్యారు. బీఎస్పీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ, జాతీయ స్థాయి ఆఫీస్ బేరర్లు, రాష్ట్ర పార్టీ నేతలు అందరూ కలిసి ప్రత్యేక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ వెల్లడించింది. ప్రత్యక్ష రాజకీయాల నుంచి మాయావతి వైదొలుగుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఆమె కొట్టిపారేసిన మరుసటి రోజే అమెను మళ్లీ అధ్యక్షురాలిగా ఎన్నుకోవడం గమనార్హం. కాగా మాయావతి క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకుంటున్నారంటూ ఈ మధ్యకాలంలో జరుగుతున్న ప్రచారాన్ని ఆమె కొట్టిపారేశారు. 'కులవాద మీడియా' ఇలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేస్తోందని ఆరోపించారు. డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్, గౌరవనీయులైన కాన్షీరామ్ జీ లాంటి బహుజనుల ఆశయాలను నిర్వీర్యం చేసే ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొట్టడం కోసం తన చివరి శ్వాస వరకు బీఎస్పీ ఆత్మగౌరవం, ఆత్మగౌరవ ఉద్యమానికి అంకితం కావాలన్నదే తన నిర్ణయమని చెప్పారు. క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాను లేనప్పుడు లేదా అనారోగ్యంతో ఉన్నప్పుడు ఆకాశ్ ఆనంద్‌ను బీఎస్పీ వారసుడిగా పార్టీ ప్రతిపాదించిందని మాయావతి చెప్పారు. అప్పటి నుంచి ఇలాంటి తప్పుడు వార్తలను కుల మీడియా ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఇలాంటి ప్రచారాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. గతంలో తనను రాష్ట్రపతిని చేస్తారన్న పుకార్లు కూడా వ్యాపించాయని మాయావతి గుర్తుచేశారు. రాష్ట్రపతి కావడమంటే క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకోవడమేనని, కాన్షీరామ్ శిష్యురాలిగా తాను ఆ పదవిని ఎలా స్వీకరిస్తాను..? అని ప్రశ్నించారు.

# లండన్ పురుషుల స్పెర్మ్ బిజినెస్




**లండన్ :** ఈమధ్య కాలంలో పురుషుల వీర్య కణాలతో ప్రపంచవ్యాప్తంగా పెద్ద వ్యాపారమే జరుగుతుంది. ఈ విషయం అనేక మందికి తెలియదు. ఉద్యోగాలు, వ్యాపారాలు చేసి డబ్బులు సంపాదించే వారికంటే వీర్యకణాలను అమ్ముకుంటూ డబ్బులు సంపాదించేవారి సంఖ్య రోజురోజుకి పెరిగిపోతూ ఉంది. ముఖ్యంగా లండన్ దేశం నుండి ఇతర దేశాలకు ఎక్కువ శాతం వీర్య కణాల ఎగుమతి జరుగుతుంది. ఎందుకని లండన్ పురుషుల వీర్య కణాలకు ఈ స్థాయి డిమాండ్ ఉంది?, అక్కడ పురుషుల వీర్యం లో ఏమైనా ప్రత్యేకత ఉందా?, లేకపోతేఇతర దేశాలలో ప్రతీ ఏడాది పురుషుల సంఖ్య తగ్గిపోతూ ఉందా?, అసలు ఏమి జరుగుతుంది అనేది ఇప్పుడు మనం చూద్దాం. లండన్ లో ఉండే పురుషులు కూడా వీర్య కణాలు దానం చెయ్యొచ్చు. కానీ అక్కడ ఒక నిబంధన ఉంది. లండన్ లో ఉండే వీర్య దాతల నుండి ఆసుపత్రులు కేవలం 10 కుటుంబాలకు మాత్రమే వీర్యం దానం చేసేందుకు అనుమతిని ఇచ్చింది. కానీ లండన్ నుండి ఇతర దేశాలకు వీర్య కణాలను ఎగుమతి చేయడంపై ఎలాంటి నిషేధం లేదు. అందుకే లండన్ పురుషుల స్పెర్మ్ (వీర్యకణాలు) పై రోజు రోజుకి డిమాండ్ పెరుగుతుంది. లండన్ లో ఉండే మహిళలు ఈమధ్య స్వలింగ సంపర్కులు గర్భం దాల్చడంలో ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల సంతానోత్పత్తి చికిత్సలకు భారీగా డిమాండ్ పెరగడంతో వీర్యదాతలకు కూడా డిమాండ్ పెరిగింది. ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఎఎఈ) మరియు అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీస్ (ఒఖీ) వాడకం పెరగడంతో ఆడవాళ్లు స్పెర్మ్ బ్యాంకులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈమధ్యకాలం లో అనేక మంది పెళ్లి కి దూరంగా ఉంటూ, వృత్తిపరంగా ఉన్నత స్థానాలను అధిరోహించడానికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. ఆ తర్వాత కొన్నాళ్ళకు వారికి ఒక కుటుంబం ఉంటే బాగుంటుంది అనిపిస్తుంది. ఆ సమయంలో వారికి వయస్సు రీత్యా గర్భం దాల్చే సామర్థ్యం తగ్గిపోతుంది కాబట్టి స్పెర్మ్ బ్యాంకుల సహాయంపై ఆధారపడుతుంటారు. ఒంటరి మహిళలు, లెస్బియన్ జంటలు ఎక్కువగా ఈ సేవల కోసం మొగ్గు చూపుతుంటారు. ఇది ఇలా ఉండగా స్పెర్మ్ డొనేషన్ ను మహిళలకు మరింత చేరువ చేసేందుకు స్పెర్మ్ బ్యాంకులు తమ సేవలను మరింత విస్తరింపజేశాయి. వీర్య దానం పొందిన వారు పెద్ద ఎత్తున డబ్బులు కూడా చెల్లిస్తున్నారు. దీంతో లండన్ లో నివసించే పురుషులు చాలా మంది దీనిని ఒక వృత్తిగా తీసుకున్నారు. అయితే ఈ వీర్య దానం పై భారతదేశం లో ఉండే పురుషులకు సరైన అవగాహన లేదు. లండన్ స్థాయిలో ఇక్కడ వీర్య కణాలతో వ్యాపారం చేసేవారి సంఖ్య చాలా తక్కువ. అసలు ఇలాంటివి కూడా జరుగుతాయా అని కొంతమంది ఆశ్చర్యపోతూ అడుగుతుంటారు. అలా దీని గురించి ఏమాత్రం అవగాహన లేని వారు, తెలుగులో గత ఏడాది విడుదలైన 'మిస్ శెట్టి..మిస్టర్ పోలిశెట్టి' చిత్రాన్ని చూడండి. ఇందులో నవీన్ పోలిశెట్టి, అనుష్క శెట్టి హీరోహీరోయిన్లు గా నటించారు.


## నిబంధనల మేరకే ఖర్గే కుటుంబసభ్యుల ట్రస్ట్‌కు భూ కేటాయింపు : సిద్ధరామయ్య




బెంగళూర్‌కు సమీపంలోని ఏరోస్పేస్ పార్క్‌లో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే కుటుంబానికి చెందిన ట్రస్ట్‌కు ప్లాట్ కేటాయించడంపై కర్నాటక సీఎం సిద్ధరామయ్య స్పందించారు. అధికారులు నిబంధనల మేరకే సదరు ట్రస్ట్‌కు భూమి కేటాయించారని, అర్హతలు, విధి, విధానాలను అనుసరించారని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కాషాయ పాలకులు చాణక్య యూనివర్సిటీకి భూములు కేటాయించారని ఆరోపించారు. కాగా, బెంగళూర్‌కు సమీపంలోని ఓ ఏరోస్పేస్ పార్క్‌లో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే కుటుంబానికి చెందిన ఓ ట్రస్ట్‌కు 5 ఎకరాల భూ కేటాయింపునకు ఆమోదం లభించడం పెను దుమారం రేపుతోంది. ఖర్గే కుమారుడు రాహుల్ ఈ ట్రస్ట్‌కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఖర్గే కుటుంబానికి చెందిన ట్రస్ట్కు కర్నాటక పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి బోర్డు (%ఖ×ూణదీ%) స్థల కేటాయింపు అధికార దుర్వినియోగమని, కర్నాటక సర్కార్ బంధుప్రీతికి సంకేతమని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాల్వీయ ట్వీట్ చేశారు. ఈ ఉదంతంపై ఖర్గే సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. ఐదు ఎకరాల భూమిని ఎస్సీ కోటా కింద సిద్ధార్థ విహార్ ట్రస్ట్‌కు కట్టబెట్టారని, ఈ ట్రస్ట్ కాంగ్రెస్ చీఫ్ ఖర్గే అల్లుడు, కలబురగి ఎంపీ రాధాకృష్ణ, కుమారుడు రాహుల్ ఖర్గే ఇతర కుటుంబసభ్యులు నిర్వహిస్తున్నారని మాల్వీయ పేర్కొన్నారు. హైటెక్ డిఫెన్స్ ఏరోస్పేస్ పార్క్ కోసం కేఐఏడీబీ పక్కనపెట్టిన 45.94 ఎకరాల స్థలంలో ఈ 5 ఎకరాలు భాగమని వివరించారు. స్థలాల కేటాయింపులో అక్రమాలు జరిగాయని సామాజిక కార్యకర్త దినేష్ కలహల్లి కర్నాటక గవర్నర్ తావర్ చంద్ గహ్లోట్‌కు ఫిర్యాదు చేశారు.

# గుడికని వెళ్లి శవాలై తేలారు..

## చెట్టుకు వేలాడుతూ కనిపించిన ఇద్దరమ్మాయిల మృతదేహాలు




**ఫరూఖాబాద్:** ఉత్తరప్రదేశ్‌లోని ఫరూఖాబాద్‌లో ఘోరం చోటుచేసుకుంది. ఇద్దరు అమ్మాయిలు చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించడం తీవ్ర విషాదాన్ని నింపింది. కోత్‌వాలీ కాయమ్‌గంజ్ ప్రాంతంలోని భగౌతిపూర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఇద్దరు బాలికలు జన్మాష్టమి సందర్భంగా గుడికి బయలుదేరినట్టు తెలుస్తోంది. అర్ధరాత్రి వరకూ ఇంటికి చేరుకోకపోవడంతో వారిద్దరూ తమ బంధువుల ఇంట్లో ఉండవచ్చని కుటుంబ సభ్యులు భావించారు. అయితే ఈ ఇద్దరూ ఒకే దుప్పట్టాకు చుట్టబడి మృతదేహాలుగా చెట్టుకు వేలాడుతూ కనిపించడంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు కన్నీరుమున్నీరయ్యారు. తమ ఇద్దరు కుమార్తెలను హత్యచేసి, వారి శవాలను చెట్టుకు వేలాడదీసినట్టు కుటుంబ సభ్యులు ఆరోపించారు. కాగా, సమాచారం అందిన వెంటనే స్థానిక ఎస్పీ, ఫోరెన్సిక్ టీమ్ ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం పంపారు.

**నిష్పాక్షిక దర్యాప్తునకు అఖిలేష్ డిమాండ్**

కాగా, జన్మాష్టమి వేడుకల కోసం ఇంటి నుంచి బయలుదేరిన ఇద్దరు అమ్మాయిలు శవాలై చెట్టుకు వేలాడుతూ కనిపించిన ఘటనపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ స్పందించారు. యువతుల అనుమానాస్పద మృతిపై బీజేపీ ప్రభుత్వం నిష్పాక్షిక దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు సమాజంలో భయభ్రాంతులను సృష్టిస్తాయని, ముఖ్యంగా మహిళా సమాజం తీవ్ర ఆందోళనకు గురవుతుందని అన్నారు. రాజకీయాలకు అతీ తంగా మహిళా భద్రతపై దృష్టిసారించాలని ఆయన సూచించారు. యూపీ కాంగ్రెస్ సైతం ఈ ఘటనపై ప్రభుత్వాన్ని నిలదీసింది. ఇద్దరు బాలికలను చెట్టుకు ఉరితీసినదెవరు? ఎందుకు ఉరితీశారు? ఎవ్వరికీ ఏమీ తెలియదు. మహిళల క్రిమిటోరియంగా రాష్ట్రం మారుతోందంటూ విమర్శించింది. నిర్భీతగా జరుగుతున్న ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేంత వరకూ ఆడకూతుళ్లు నిర్భయంగా తిరగలేరని పేర్కొంది.

## హర్యానాలో జేజేపీ, ఆజాద్ సమాజ్ పార్టీ పొత్తు



అసెంబ్లీ ఎన్నికల వేళ హర్యానాలో కొత్త పొత్తు పొడిచింది. హర్యానా మాజీ ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ చౌతలా నేతృత్వంలోని జననాయక్ జనతా పార్టీ చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని ఆజాద్ సమాజ్ పార్టీ - కాన్షీరామ్ పొత్తుపెట్టుకున్నాయి. ఈ పొత్తు విషయాన్ని దుష్యంత్ చౌతలా వెల్లడించారు. మాయావతి నేతృత్వంలోని బహుజన్ సమాజ్‌వాది పార్టీ కంటే చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని ఆజాద్ సమాజ్ పార్టీతో పొత్తే రాజకీయంగా మేలని తాను భావించానని, అందుకే ఆ పార్టీతో పొత్తుపెట్టుకున్నానని చెప్పారు. పొత్తులో భాగంగా హర్యానాలోని మొత్తం 90 అసెంబ్లీ సీట్లకుగాను జేజేపీ 70 చోట్ల, ఆజాద్ సమాజ్ పార్టీ 20 చోట్ల పోటీ చేయనున్నాయని తెలిపారు. కాగా, హర్యానాలో అక్టోబర్ 1న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. అదే నెల 4న ఓట్లను లెక్కించనున్నారు. ఈ మేరకు ఇటీవలే కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి హర్యానాలో అసెంబ్లీ ఎన్నికల కోలాహలం నెలకొన్నది. పార్టీలు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి.

## దేశానికి అన్నం పెట్టే రైతులను అవమానించడం తగదు

### కంగనా రనౌత్ వ్యాఖ్యలపై హిమాచల్ సీఎం ఫైర్




రైతుల నిరసనలపై బీజేపీ ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలపై హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు స్పందించారు. కంగనా వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రైతులపై ఈ తరహా వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులను తూలనాడటం తప్పని, వీరు దేశానికి ఆహారాన్ని సమకూర్చేందుకు ఏడాది పొడవునా శ్రమిస్తారని చెప్పారు. ఈ తరహా వ్యాఖ్యలతో వారిని అవమానించే హక్కు ఏ ఒక్కరికీ లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కంగనా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. కాగా, రైతుల నిరసనలను కట్టడి చేసేందుకు మోదీ ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టకుంటే ఇవి బంగ్లాదేశ్ తరహా అశాంతి పరిస్థితులకు దారితీసే అవకాశం ఉందని బీజేపీ నేత, మండి ఎంపీ కంగనా రనౌత్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన పోరాటంలో మృతదేహాలు వేలాడుతూ కనిపించాయని, లైంగిక దాడులు చోటుచేసుకున్నాయని ఎక్స్ వేదికగా షేర్ చేసిన వీడియోలో ఆరోపించారు. సాగు చట్టాలను వెనక్కితీసుకున్నా నిరసనలు కొనసాగేలా విదేశీ శక్తులు, స్వార్థప్రయోజనాలు ఆశించే వారు ప్రోత్సహించారని దుయ్యబట్టారు. బంగ్లాదేశ్‌లో ఏం జరిగిందో ఇక్కడ కూడా జరిగే అవకాశం ఉంది, విదేశీ శక్తులు ఇందుకు కుట్ర పన్నారని ఆమె ఆరోపించారు. దేశం కుక్కలపాలైనా వారికేం పట్టదని విమర్శించారు. బాలీవుడ్ క్వీన్ వ్యాఖ్యలు సొంత పార్టీలోనే దుమారం రేపాయి. పంజాబ్ సీనియర్ బీజేపీ నేత హర్జిత్ గరేవాల్ కంగనా రనౌత్ వ్యాఖ్యల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్సీ కవితకు బెయిల్

-మొదటిపేజీ తరువాయి

తెలిసిందే. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ ఆమెకు బెయిల్ లభించింది. బెయిల్ కోసం రూ.10 లక్షల పూచీకత్తు సమర్పించాలని సూచించింది. సాక్షులను ప్రభావితం చేయకూడదని ఆదేశించింది. దీంతో దాదాపు 165 రోజుల తర్వాత కవిత జైలు నుంచి బయటకు రానున్నారు. ఇవాళ రాత్రి 7 గంటల తర్వాత కవిత తీహార్ జైలు నుంచి విడుదల కానున్నారు. ఇవాళ రాత్రికి ఆమె ఢిల్లీలోనే బస చేయనున్నారు. బుధవారం మధ్యాహ్నం 2:45 గంటలకు ఢిల్లీ నుండి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. కవిత వెంట ఆమె భర్త అనిల్ కుమార్, కేటీఆర్, హరీష్ రావు రానున్నారు. ఇక రేపు ఉదయం బీఆర్ఎస్ నేతలు ఢిల్లీలో ప్రెస్ మీట్ పెట్టే అవకాశం ఉంది.

కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. లిక్కర్ కేసులో దర్యాప్తు పూర్తయ్యిందని.. ఛార్జ్ షీట్ కూడా దాఖలైందని ఈ దశలో కవితను జ్యుడీషియల్ కస్టడీలో ఉంచడం సరికాదని అభిప్రాయడింది. సెక్షన్ 45 ప్రకారం ఒక మహిళ బెయిల్ పొందేందుకు అర్హత ఉందని ధర్మాసనం తెలిపింది. గతంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టిపారేసింది. సెక్షన్ 45 అనేది దుర్బల మహిళలకు మాత్రమే వర్తిస్తుందన్నట్లు హైకోర్టు జడ్జి వ్యవహరించారని పేర్కొంది. సెక్షన్ 45పై కోర్టులు



సున్నితంగా వ్యవహరించాలని చెప్పింది. ఒక మహిళ విద్యాధికురాలు అయినంత మాత్రాన ఆమెకు బెయిల్ నిరాకరించడం సరికాదని తెలిపింది. ఈ మేరకు బెయిల్‌ను మంజూరు చేసింది.

### ఎమ్మెల్సీ కవిత బెయిల్ ఆర్డర్‌లోని కీలక అంశాలు ఏంటంటే...!

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆమె దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై దాదాపు గంటన్నర పాటు వాదనల అనంతరం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ కవితకు బెయిల్ మంజూరు చేస్తూ తీర్పునిచ్చింది.

ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీటు దాఖలు చేసినందున నిందితురాలు కారాగారంలో ఉండాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా న్యాయస్థానం పేర్కొంది. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ బెయిల్ ఇచ్చింది. బెయిల్ కోసం రూ.10 లక్షల పూచీకత్తు సమర్పించాలని తెలిపింది.

అలాగే సాక్షులను ప్రభావితం చేయకూడదని కోర్టు ఆదేశించింది. సెక్షన్ 45 ప్రకారం ఒక మహిళ బెయిల్ పొందేందుకు అర్హత ఉందని ధర్మాసనం పేర్కొంది. ఈ సందర్భంగా గతంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టిపారేసింది. దీంతో దాదాపు ఐదు నెలలుగా తీహార్ జైలులో ఉన్న కవిత బయటకు రానున్నారు. ఇక కవితకు బెయిల్ లభించడంతో బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.

### కవిత బెయిల్ ఆర్డర్‌లోని కీలక అంశాలివే..!

పాస్‌పోర్టును మేజిస్ట్రేట్‌కు సరెండర్ చేయాలి

కేసు ట్రయల్‌కు సహకరించాలి

విదేశాలకు వెళ్లాలంటే తప్పనిసరిగా కోర్టు అనుమతి తీసుకోవాలి

విచారణ వాయిదాల సమయంలో దర్యాప్తు సంస్థలకు సహకరించాలి

# ఆ రెండు చెరువులుపై దృష్టి

**తుమ్మిడికుంటలో మల్లారెడ్డి వర్సిటీ**

**నాదం చెరువులో అనురాగ్ వర్సిటీ**

**హైదరాబాద్ :** తమ్మిడి కుంట చెరువు విస్తీర్ణం 29.6 ఎకరాలు. ప్రస్తుతం అది పది ఎకరాలకు పడిపోయింది. దాదాపు 19 ఎకరాల చెరువు స్థలం కబ్జాకు గురైంది. అందులో కొంతమంది ఇళ్లు నిర్మించుకున్నారు. మరి కొంతమంది బహుళ అంతస్తులు ఏర్పాటు చేసుకున్నారు. ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేత నేపథ్యంలో వారిలో భయం మొదలైంది. ఇదే సమయంలో ఏం జరుగుతుందోననే ఆందోళన వ్యక్తం అవుతుంది. మరోవైపు చెరువుల్లో ఆక్రమణల కూల్చివేత నిరంతరం కొనసాగుతుందని హైడ్రాధికారులు చెబుతున్నారు. మేడ్చల్ జిల్లా పరిధిలోని మాజీ మంత్రి మల్లారెడ్డికి చెందిన కళాశాలలు, హాస్టళ్లు చెరువుల ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్, ప్రభుత్వ స్థలాల్లో నిర్మించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే మల్లారెడ్డి ప్రభుత్వ స్థలంలో ఆక్రమించి నిర్మించిన నిర్మాణాన్ని కూల్చివేయించారు. ఇప్పుడు ఎన్ కన్వెన్షన్ సెంటర్ ను పడగొట్టిన తర్వాత.. తదుపరి కూల్చివేతలు మల్లారెడ్డి కి సంబంధించిన నిర్మాణాలేనని పొలిటికల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మల్లారెడ్డికి సంబంధించిన పలు నిర్మాణాలపై కోర్టు స్టేలు ఉన్నాయి. కాప్రా లోని మల్లారెడ్డికి సంబంధించిన ఒక నిర్మాణం ఉంది. అయితే దానిపై ఇటీవల స్టే వెకేట్ అయినట్టు తెలుస్తోంది. దీంతో చర్యలు తీసుకునేందుకు మేడ్చల్ అధికారులు సమాయత్తమవుతున్నారు.గత ఏడాది వానా కాలంలో మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆసుపత్రి లోకి వాన నీళు వచ్చాయి. అప్పట్లో మల్లారెడ్డి పై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శలు చేశాయి. ముఖ్యంగా అప్పటి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పలు దస్త్రాలను విలేకరులకు అందించారు. మల్లారెడ్డి అనేక అక్రమాలకు పాల్పడి కళాశాలలు, ఇతర భవనాలు నిర్మించాలని ఆరోపించారు. దీనిపై కోర్టులో కేసులు కూడా వేశారు. ఆ సమయంలో మల్లారెడ్డి బహిరంగంగా రేవంత్ రెడ్డికి తొడ కొట్టి సవాల్ విసిరారు. ఆ తర్వాత ఏడాది గడవగానే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు.. ఆయన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు చెప్పినట్టుగానే ఇప్పుడు అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి.. నేలమట్టం చేస్తున్నారు. మల్లారెడ్డి కి సంబంధించినవి ఇవి మాత్రమే కాకుండా మేడ్చల్, ఇతర ప్రాంతాలలో నిర్మించిన కళాశాలలు కూడా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి కట్టినవేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. అంతకుముందు సంవత్సరం ఐటీ అధికారులు మల్లారెడ్డి విద్యాసంస్థల్లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ కేసుకు సంబంధించి ఇప్పటికి కోర్టులో విచారణ కొనసాగుతోంది. మళ్లీ ఇప్పుడు ఆయన విద్యాసంస్థలపై హైడ్రా చర్యలు తీసుకుంటుందనే చర్చ జోరుగా సాగుతోంది.



### వెంకటాపూర్‌లో అనురాగ్

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి చెందిన విద్యాసంస్థలపై పోచారం ఐటిసి పోలీస్ స్టేషన్లో కేసు నమోదయింది. రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అనురాగ్ విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. అయితే ఆయన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనురాగ్ విద్యాసంస్థలు, గాయత్రి ఎడ్యుకేషనల్ ట్రస్ట్.. మేడ్చల్ జిల్లాలోని నాడెం చెరువు బఫర్ జోన్ లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టాయని నీటిపారుదల శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం వెంకటాపూర్ పంచాయతీలోని కొర్రెముల రెవెన్యూ పరిధిలోని 813 సర్వే నెంబర్లు ఈ విద్యాసంస్థలు వివిధ నిర్మాణాలు చేపట్టాయి. అయితే ఆ చెరువుకు 30 మీటర్ల బఫర్ జోన్ వదిలిపెట్టి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అయితే యాజమాన్యం ఆ నిబంధనను పక్కనపెట్టి నిర్మాణాలు చేపట్టింది. ఈ క్రమంలో ఘట్కేసర్ మండల ఇరిగేషన్ ఏఈ పరమేష్.. ఈనెల 22న బఫర్ జోన్ లోని నిర్మాణాలను పరిశీలించారు. వాల్టా చట్టంలోని పలు సెక్షన్లను పేర్కొంటూ పోచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు నంగార భేరి లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ నాయక్ అనురాగ్ విద్యాసంస్థల ఆక్రమణలపై కలెక్టర్, నేటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎటువంటి ఉపయోగం లేకుండా పోయింది. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. బఫర్ జోన్ లోనూ నిర్మాణాలు చేపట్టిన అనురాగ్ విద్యా సంస్థలు, గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు.మరోవైపు హైడ్రా తమ ఆస్తుల విషయంలో పరిధికి మించి జోక్యం చేసుకుంటుందని.. కూల్చివేతలను చేపట్టకూడదని పేర్కొంటూ రాష్ట్రంలోని పలు విద్యాసంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి. ఇందులో అనురాగ్ విద్యా సంస్థలు కూడా ఉన్నాయి. భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే పళ్ళ రాజేశ్వర్ రెడ్డి చెందిన అనురాగ్ యూనివర్సిటీ, గాయత్రి ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ట్రస్ట్, నీలిమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వంటి సంస్థలు హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశాయి. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం కురెముల గ్రామంలోని 823/ ఈ, 813/ఈఈ, 813/ఏఏ/2, 813/ ఏ ఏ/ 1796 సర్వే నెంబర్లలో 17.21 ఎకరాల భూమి, ఇతర నిర్మాణాలపై హైడ్రా అధికారులు జోక్యం చేసుకొని.. విచారణ పేరుతో మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని ఆ విద్యాసంస్థలు ఫిర్యాదుల పేర్కొన్నాయి. హైడ్రా నిలువరించకపోతే.. తమ నిర్మాణాలను పడగొట్టే ప్రమాదం ఉందని ఆ విద్యాసంస్థల బాధ్యులు పేర్కొన్నారు. ఇదే సమయంలో విద్యాసంస్థల ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న హైకోర్టు.. నిబంధన ప్రకారం నడుచుకోవాలని సూచించింది. ఈ ప్రకారం ప్రభుత్వ న్యాయవాది హామీ ఇవ్వడంతో కేసు ముగిసింది .మరోవైపు అనురాగ్ విద్యాసంస్థలపై వస్తున్న ఆరోపణలపై ఆ విద్యాసంస్థల చైర్మన్ పల్లా రాజేశ్వరరెడ్డి స్పందించారు. ప్రభుత్వం తమపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తమ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థల్లో ప్రభుత్వం ఈ ఈ సంవత్సరం వివిధ కోర్సుల్లో 480 సీట్లలో కోత విధించింది అన్నారు. తమ కళాశాలకు అనుమతి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుందని వాపోయారు. ఇప్పటికే తమ విద్యాసంస్థలపై విజిలెన్స్, ఇంటలిజెన్స్, రెవెన్యూ, నీటిపారుదల, విద్యాశాఖ అధికారులు నిత్యం సోదాలు నిర్వహిస్తున్నారన్నారు. ఎలాంటి అవకతవకలు చోటు చేసుకున్నట్టు కనిపించకపోవడంతో.. నీటిపారుదల శాఖ అధికారులపై ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి తీసుకొచ్చి తమపై మరో కేసు నమోదు చేశారని ఆయన వివరించారు. ఈ కేసు వల్ల తమ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆయన వాపోయారు

# అమ్మో... క్యాంప్ ఆఫీసులా...

**వరంగల్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాలు బోసి పోతున్నాయి. క్యాంప్ ఆఫీసులోకి కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలు అడుగుపెట్టడం లేదు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని క్యాంప్ కార్యాలయాలు గెస్ట్ హౌస్ లగా... గెస్ట్ హౌస్ లు క్యాంప్ కార్యాలయాలుగా మారాయి. మరికొన్ని తాళాలు తెరుచుకోవడం లేదు. కొందరు ఇగో మరికొందరు వాస్తు అనుమానంతో ఎమ్మెల్యేలు క్యాంప్ ఆఫీస్ లకు వెళ్ళడం లేదనే ప్రచారం జరుగుతుంది.

ఎమ్మెల్యేలు నియోజకవర్గ కేంద్రంలో అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లను నిర్మించింది. నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంతో పాటు నివాసం ఉండే విధంగా నిర్మించడం జరిగింది. ఒక్కో క్యాంప్ ఆఫీసు ను ఒక కోటి బడ్జెట్ తో నియోజకవర్గాల్లో నిర్మించింది బీ అర్ ఎస్ ప్రభుత్వం. రాష్ట్రంలో కొత్తగా క్యాంప్ కార్యాలయాలు నిర్మాణం కావడంతో బీఅర్ఎస్ ఎమ్మెల్యేలతో పాటు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు క్యాంప్ కార్యాలయాల్లోకి వెళ్ళారు. 2023 ఎన్నికల్లో గెలిచిన గతంలో ఎమ్మెల్యేగా ఉండి తిరిగి గెలిచిన వారు కొనసాగగా.. కొత్తగా గెలిచిన వారు క్యాంప్ కార్యాలయాల్లో అడుగు పెట్టడం లేదు.ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11 ఎమ్మెల్యేలు అండగా కొందరు క్యాంప్ ఆఫీసు ముఖం చూడకపోతే.. మరికొందరు వెళ్ళమా కొద్ది సేపు ఉన్నామా అన్న విధంగానే ఉన్నారు. నర్సంపేట ఎమ్మెల్యేగా గెలిచిన దొంతి మాధవ రెడ్డి క్యాంప్ ఆఫీసు ముఖం చూడలేదు. గతంలో ఎమ్మెల్యే గా ఉన్న సుదర్శన్ రెడ్డి ఓడిపోగానే ఖాళీ చేసి వెళ్ళారు. మాధవ రెడ్డి క్యాంప్ కార్యాలయం కు వెళ్ళలేదు. మాధవ రెడ్డి నర్సంపేట నుండి రెండవ సారి ఎమ్మెల్యేగా గెలిచారు. మాధవరెడ్డి ఎవరు ఏమనుకున్నా ఎన్ని విమర్శలు వచ్చిన తనకు నచ్చినట్టు చేస్తారు. క్యాంప్ ఆఫీస్ విషయంలో కూడా ఇదే జరిగింది. వెళ్ళనంటే వెళ్లనని నర్సంపేట క్యాంప్ ఆఫీస్ ను ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ గా మార్పు చేసి. ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ను ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ గా మార్చుకున్నారు. గెస్ట్ హౌస్ ను క్యాంప్ ఆఫీస్ గా మార్చుకొని ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. మాధవ రెడ్డి పై ఎన్ని విమర్శలు వచ్చిన పట్టించుకోవడంలేదు. ఇక మరో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి. పాలకుర్తి నియోజకవర్గం నుండి గెలిచిన అతిచిన్న వయసులో గెలిచిన ఎమ్మెల్యే. అంతేకాదు ఓటమి ఎరుగని దయాకర్ రావు పై విజయం సాధించి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందారు. యశస్విని రెడ్డి క్యాంప్ ఆఫీసు లోకి వెళ్ళడంలేదు. వాస్తు దోషం ఉందనే కారణంతో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి క్యాంప్ కార్యాలయానికి వెళ్ళడంలేదట. మరో ప్రచారం లేకపోలేదు. రాజకీయంగా అనేక ఇబ్బందులకు గురిచేసిన దయాకర్ రావు ఉన్న ఆఫీస్ లోకి వెళ్ళడం లేదనే ప్రచారం లేకపోలేదు. యశస్విని రెడ్డి తొర్రూరు లోని నివాసం వద్ద ప్రజలకు అందుబాటు ఉంటూ పాలనను సాగిస్తున్నారు.

## 10 రోజుల పాటు ప్రజాపాలన

-మొదటిపేజీ తరువాయి

వచ్చే 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకుని ఆస్పత్రిని నిర్మించాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా డిజైన్లు ఉండాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా రోడ్ కనెక్టివిటీ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు ముఖ్యమంత్రి.

## ఆదివాసీలు, గిరిజనులు అన్ని రంగాల్లో ముందుండాలి




-మొదటిపేజీ తరువాయి

ములుగు జిల్లాను ఎంచుకున్నాను. తాను కుడా గతంలో పంచాయతీ రాజ్, రూర ల్ డెవలప్‌మెంట్ మంత్రిగా పని చేసిన అనుభవం ఉందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలతో గిరిజనులు ఆదివాసీలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వీరికి అన్ని రకాలుగా మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేయ డం అభినందనీయమని పేర్కొన్నారు. మీరంతా అత్యుత్తమంగా విద్యను అభ్యసించి నవ సమాజ నిర్మాణం లో కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. గిరిజను,ఆదివాసీలు ఆధునిక సమాజానికి అనుగుణంగా ప్రభు త్వం కల్పిస్తున్న అవకాశాలతో అన్ని రంగాల్లో ఆర్థికంగా పైకి రావాలని సూచించారు. ఇతర వర్గాలకు ఆదర్శంగా నిలువాలని, ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

## కవితకు బెయిల్ ఇప్పించిన కాంగ్రెస్‌కు అభినందనలు!

-మొదటిపేజీ తరువాయి

వచ్చారని, ఇక కాంగ్రెస్ వ్యక్తి రాజ్యసభకు వెళతారని వ్యాఖ్యానించారు. కవితకు బెయిల్ కోసం కోర్టులో వాదనలు వినిపించిన కాంగ్రెస్ అభ్యర్థిని ఏకగ్రీవంగా రాజ్యసభకు నామినేట్ చేయడానికి కేసీఆర్ అద్భుతమైన రాజకీయ చతురత ప్రదర్శించారన్నారు.

## బండి సంజయ్‌పై చర్యలు తీసుకోండి.. సుప్రీంకోర్టుకు కేటీఆర్ రిక్వెస్ట్

ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయటంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. సుప్రీంకోర్టుకు ఉద్దేశాలు ఆపాదించేలా కామెంట్స్ చేసిన బండి సంజయ్ తీరును తప్పుబట్టారు. ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలా విజయమంటూ బండి సంజయ్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ లాయర్ చేసిన కృషితో ఒకరికి బెయిల్ వస్తే బీఆర్ఎస్ సపోర్ట్ కారణంగా ఒకరు రాజ్యసభలో స్థానం పొందారంటూ వివాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ కవిత బెయిల్ కోసం తొలుత వాదనలు వినిపించిన లాయర్‌కు కాంగ్రెస్ తరఫున రాజ్యసభ సీటు వచ్చేలా కేసీఆర్ రాజకీయ చతురత ప్రదర్శించారంటూ ఆయన చేసిన ట్వీట్ చేశారు. వైన్ అండ్ డైన్ క్రైమ్ లో పార్టనర్స్ అయిన కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు కంగ్రాట్యులేషన్స్ అంటూ ఆయన స్థాయిని మరిచి సుప్రీంకోర్టు తీర్పును అపహాస్యం చేసేలా బండి సంజయ్ కామెంట్స్ చేశారు. దీనిపై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. కేంద్ర హోంశాఖ సహాయశాఖ మంత్రిగా ఉన్న బండి సుప్రీంకోర్టు తీర్పుపై అభ్యంతరం వ్యక్తం చేయడం సరికాదని తెలిపారు. గౌరవప్రదమైన స్థానంలో ఉండి ఇలా స్పందించడమేంటని నిలదీశారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ధిక్కారంగా తీసుకుని బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## హైడ్రా కూల్చివేతలకు అడ్డొస్తే బుల్డోజర్ ఎక్కించాలి

హైడ్రా చేపడుతున్న అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు చేస్తున్న వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. పార్టీలోని ఇతర నాయకులు హైడ్రాపై ఆచితూచి మాట్లాడుతుంటే రఘునందన్ మాత్రం అధికార కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇటీవల నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేతను సమర్థించిన ఆయన.. ఈ విషయంలో అవసరమైతే ప్రభుత్వం తరపున హైకోర్టులోనూ వాదనలు వినిపించేందుకు సిద్ధమని ప్రకటించి సంచలనమే సృష్టించారు. తాజాగా, మరోమారు అలాంటి వ్యాఖ్యలే చేశారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు అడ్డొచ్చే వారిపై బుల్డోజర్లు ఎక్కించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం చెరువులు, కుంటలు, ఆక్రమణల కూల్చివేతల విషయంలో ఎంతటి వారైనా వదిలిపెట్టవద్దని, ఈ విషయంలో హైడ్రా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. అలాగని పేదల జోలికి వస్తే మాత్రం సహించేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. హైడ్రా విధుల్లో రాజకీయ నాయకులు ఎవరూ కలగజేసుకోవద్దని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవి ప్రభుత్వ భవనాలైనా సరే కూల్చివేయాల్సిందేనని తేల్చి చెప్పారు.

## టీ కాంగ్రెస్ లో బీసీ నినాదం...

**హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలప్పుడు అందరి నోటా వినిపించిన మాట.. బీసీలకు ప్రాధాన్యత. అప్పట్లో టికెట్లను ముందే ప్రకటించిన బీఆర్ఎస్.. 22 మంది బీసీలకు సీట్లు ఇచ్చింది. బీఆర్ఎస్ కంటే ఒక సీటు ఎక్కువే బీసీలకు ఇస్తామంది కాంగ్రెస్. అన్నట్టుగానే బీఆర్ఎస్ కంటే ఒక సీటు ఎక్కువే ఇచ్చింది గానీ.. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్‌లో 2 సీట్ల చొప్పున 34 అసెంబ్లీ సీట్లను బీసీలకు ఇవ్వలేకపోయింది. తెలంగాణలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 31 స్థానాలు రిజర్వ్‌డ్ కేటగిరీ. మిగిలిన 88 నియోజకవర్గాలు జనరల్. పైగా అత్యంత బలమైన ఓట్ బ్యాంక్.. బీసీలదే. ముదిరాజ్‌లు 26 లక్షలు, మున్నూరు కాపులు 15 లక్షలు, గౌడ్లు 10 లక్షలు, యాదవులు 13 లక్షలు, పద్మశాలీలు 12 లక్షలు.. ఇలా ప్రతి కమ్యూనిటీలో లక్షల సంఖ్యలో ఉన్నారు. ఆమాటకొస్తే.. తెలంగాణ జనాభాలో సగానికి పైగా ఉన్నది బీసీలే. కనీసంలో కనీసం 81 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల గెలుపోటములను బీసీ ఓటర్లే నిర్ణయిస్తారు. అయినా సరే.. ఏ పార్టీ కూడా ఇరవై, పాతికకు మించి సీట్లు ఇవ్వడం లేదు. ప్రతిసారి ఎన్నికలప్పుడే బీసీ నినాదం పుట్టుకొస్తుంది. ఈసారి మాత్రం ఎన్నికలన్నీ అయ్యాక బీసీ నాదం వినిపిస్తోంది.బీసీ నినాదం కంటే.. రెడ్డి సామాజిక వర్గానికే ఎక్కువ ప్రాధాన్యత దక్కుతోందని విమర్శిస్తున్నాయి బీసీ సంఘాలు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీగా రెడ్లకే ఎక్కువ సీట్లు ఇచ్చాయి. తెలంగాణలో 56 శాతం జనాభా ఉన్న బీసీలకు.. బీఆర్ఎస్ 22 సీట్లు ఇస్తే, కాంగ్రెస్ 23 సీట్లు ఇచ్చింది. మొత్తం జనాభాలో 6.5 శాతమే ఉన్న రెడ్డి సామాజికవర్గానికి మాత్రం.. బీఆర్ఎస్ 42 సీట్లు, కాంగ్రెస్ 44 సీట్లు ఇచ్చాయి. అధికారంలోకి వచ్చిన తరువాత కూడా రెడ్డి సామాజికవర్గం వారికే కీలక మంత్రి పదవులు దక్కాయన్న విమర్శలు ఉన్నాయి. సో.. తెలంగాణలో సీట్ల కేటాయింపు నుంచి పదవుల పంపకం వరకు అన్నింటా బీసీలను పక్కనపెట్టి.. రెడ్డి కమ్యూనిటీకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని బహిరంగంగానే రోడ్లపైకి వస్తున్నారు కాంగ్రెస్ నేతలు. బీసీలకు గనక 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోతే భూకంపం సృష్టిస్తామని డైరెక్టుగానే మాట్లాడుతున్నారు.


# సంపాదకీయం

## వర్గీకరణ సరే! ఉపకులాల మాటేమిటీ?

మూడు దశాబ్దాల సుదీర్ఘ ఉద్యమాల తర్వాత వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చిన సుప్రీంకోర్ట్ ఈ అంశాన్ని రాష్ట్రాల చేతిలో పెడుతూ తీర్పునిచ్చింది. అయితే, మాల మేధావుల భాగస్వామ్యం లేనిది ఈ అంశం తేలేది కాదు. అన్ని కులాలు సమాన అవకాశాలను సమానంగా పొందడానికి ఏర్పాటు చేసుకున్న మార్గమే ఈ రిజర్వేషన్స్. ఇది అంబేడ్కర్ కోరుకున్నది. అందుకే ఈ తీర్పును మాలల మీద మాదిగలు సాధించిన విజయంగా భావించరాదు. నిజానికి, దళిత సమస్య చాలా సున్నితమైనది. ఇది రెండు పార్టీల కొట్లాట కాదు, దశాబ్దాలుగా జరుగుతున్న అసమానతల కొట్లాట. కనుక సమస్యని పరిష్కరించటానికి ఆవేశంగా నిర్ణయాలు తీసుకోకుండా ఒక కమిషన్ వేయాలి. రెండు కులాల మధ్య అధ్యయనం జరగాలి. ఆ కులాల మేధావులతో చర్చలు జరపాలి. మాలలలో వర్గీకరణ వల్ల తమకు అన్యాయం జరుగుతుందేమోనన్న అభద్రతా భావాన్ని తొలగించి వర్గీకరణ అమలు పరచాలి. వర్గీకరణ ఉద్యమం ఆంధ్రాలో మాలల అభివృద్ధితో మొదలైనది. అన్ని రంగాల్లో మాలలే ఆధిపత్యంలో ఉన్నారని తద్వారా వర్గీకరణ జరిగితే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందుతామని ఇంతకాలం పోరాడింది మాదిగ దండోరా ఉద్యమం. అయితే వారు ఆంధ్ర మాలలతో పాటు తెలంగాణ మాలలను ఒకే విధమైన అభివృద్ధితో ముడిపెట్టి చూశారు. వాస్తవానికి తెలంగాణలో మాలలు మాదిగల కన్నా అభివృద్ధిలో ముందంజలో ఉన్నారనటానికి ఎలాంటి ఆధారాలు లేవు. మరి అలాంటప్పుడు దేనిని ప్రాతిపదిక తీసుకుంటారు? మాల, మాదిగల జనాభా, విద్య, ఉద్యోగ రంగాల్లో ఎవరి వాటా ఎంత అనే అంశాన్ని తెల్చకుండా.. వర్గీకరణ అమల్లోకి తెస్తే ఇప్పటివరకు అన్ని రకాలుగా రిజర్వేషన్ ఫలాలను అందుకున్నవారే మళ్లీ అందుకుంటారు. కనుక వర్గీకరణను మాల, మాదిగల్లో ఉన్న సంచార, అర్థ సంచార కులాల (ఉపకులాలు) వారి నుండి అమలు పరచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఈ వర్గీకరణను కేవలం ఉద్యోగ రంగంలోనే కాదు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, బ్యాంకు రుణాలలో కూడా సమాన రేషియోలో పంచాలని చట్టం చేయాలి. దీనివల్ల ఆ కులాల్లో పెరిగిపోయిన అసమానతలు తగ్గి వర్గీకరణ అంశానికి న్యాయం జరుగుతుంది. ఈ నిచ్చన మెట్ల కుల వ్యవస్థలో మాల మాదిగలు ఇద్దరూ అంటరానితనంతో బలి కాబడుతున్నారు. బాధాకరం ఏమంటే ఈ పైకులాల ద్వారా ఉప కులాలు వివక్షకు గురి అవుతున్నాయి. 75 ఏళ్ల స్వతంత్ర వ్యవస్థలో ఇప్పటికీ వారు ఎలాంటి ప్రయోజనాలనూ పొందలేదు. వీరికి రాజ్యాంగ పరమైన రక్షణలు లేవు. విద్య లేనందున రిజర్వేషన్ ఫలాలను అందుకోలేదు. వీరిలో అనేక కులాలు కనీసం ఆధార్ కార్డు నోచుకోని వారు ఉన్నారు. వీరు అభివృద్ధిలో అత్యంత వెనకబాటుతనంలో ఉన్నారు. అందుకే ఈ వర్గీకరణ సంస్కరణలు వీరి నుండే మొదలు పెట్టాలి. వర్గీకరణలోని ఎ, డీలో ఉన్న మాల మాదిగ ఉపకులాలు ప్రస్తుతానికి ప్రాచుర్యంలో లేవు. గత రెండు మూడు దశాబ్దాలుగా ఊళ్లను వదిలి పట్టణాలకు వలస వచ్చిన అనేక కులాలకు ఎలా మేలు జరుగుతుంది? ప్రధాన స్రవంతికి సంబంధంలేని కులాలైన డక్కలి, బేడా, బుడగ జంగం, చిందు, హొలీయ దాసరి, రెల్లి, మాదిగ మాస్టిన్, కులాలు మాదిగ కేటగిరిలో ఉన్నాయి. విద్య ఉద్యోగ రంగాల్లో వీరి వాటా ఒక శాతం కూడా ఉండదు. కాబట్టి ఇప్పటి వరకు అన్ని రంగాల్లో ముందున్న మాదిగలతో ఈ కులాలను కలపడం వల్ల వీరికి నష్టం జరుగుతది. అంతేకాకుండా మాలల్లో కూడా అంతర్గతంగా ఉన్న సామాజిక వివక్ష వల్ల ఉపకులాల్లో ఉన్న మాల మాస్టిన్‌తో పాటు మరికొన్ని కులాలు ప్రభుత్వాల ద్వారా లబ్ధి పొందడం లేదు. అంతేకాదు ఈ జాతులు అంతరించిపోతున్నాయి. వీరికి న్యాయం జరగాలంటే వీరిని ప్రత్యేక సెక్షన్‌గా ప్రకటించి, ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలి. ఈడబ్ల్యూఎస్ కోటాలో పది శాతం కూడా లేని వారు అంతకంటే ఎక్కువ రిజర్వేషన్స్ అందుకుంటున్నారు. ఈ వర్గీకరణలోనూ క్రిమిలేయర్ అమలు పరిస్తే రిజర్వేషన్స్‌కి ముప్పు తెచ్చే విధంగా మొన్నటి సుప్రీం తీర్పు ఉంది. ఒక రకంగా ప్రభుత్వాలే ఇలాంటి కుట్రలను కోర్టుల ద్వారా చేయిస్తున్నాయి. కాబట్టి ఇలాంటి పరిస్థితుల్లో కోర్టులు, ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలపై సమిష్టి కృషితో పోరాడాలి. దళితుల ఉమ్మడి రిజర్వేషన్లను అనుభవించే విషయంలో అంతర్గతంగా అసమానతలు ఉన్నాయంటున్నారు. కానీ వాటికీ సంబంధించిన గణాంకాలు గత ఇరవై సంవత్సరాలుగా అందుబాటులో లేవు. మాదిగ దండోరా ఉద్యమం ప్రారంభమైనప్పుడు ఉన్న పరిస్థితులకి నేటికీ విద్య, ఉద్యోగ రంగాల్లో విధానపరమైన మార్పులు చాలా జరిగాయి. వర్గీకరణ జరగడం ఇప్పుడు అనివార్యమైంది కనుక ముందుగా మాల మాదిగల జనగణన జరగాలి. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లతో ముడి పెట్టకుండా పెరిగిన జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల శాతాన్ని పెంచి వర్గీకరణను అమలు చేయాలి. అప్పుడే మాల మాదిగలకు న్యాయం జరుగుతుంది.

## హాస్యం పండించడంలో సాటిలేని మేటి భమిడిపాటి

హాస్య చమత్కార యుక్త మాటలు, సంభాషణలు, రచనల కోసం జీవితాంతం తపించి, తపస్సు చేసి సిద్ధి పొందిన తాపసి భమిడిపాటి కామేశ్వర రావు. వాస్తవానికి ఆయన హాస్య సృష్టి కర్త. అందుకే హాస్య బ్రహ్మగా గుర్తింపు పొందారు. భమిడిపాటి కామేశ్వరరావు (ఏప్రిల్ 28, 1897 – ఆగష్టు 28, 1958) రచయిత, నటుడు, నాటక కర్త. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో ఏప్రిల్ 28, 1897 సంవత్సరంలో నరసావ ధానులు, లచ్చుమ్మ దంపతులకు జన్మించారు. వీరు భీమవరం లో పాఠశాల విద్యను పూర్తి చేసి, ప్రతిభావంతులైన విద్యార్థుల కిచ్చే ఉపకార వేతనం సహాయంతో, పిఠాపురం మహారాజా కళాశాలలో గణితంలో పట్టా పొందారు. తరువాత కొంత కాలం నరసాపురం, కాకినాడ లలో ఉపాధ్యాయునిగా పని చేశారు. 1922లో ఎల్.టి పరీక్షలో ఉత్తీర్ణులై రాజమండ్రి వీరేశలింగం ఆస్తిక ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర అధ్యాపక పదవిలో స్థిరపడి, అదే పాఠశాలకు రెండు సంవత్సరాలు ప్రధానోపా ధ్యాయ బాధ్యతలను కూడా నిర్వహించారు. ఉపాధ్యాయునిగా పనిచేస్తూ వీరు చాలా నాటకాలు, నాటికలు, కథలు రచించారు. సమకాలీన సాంఘిక సమస్యలను తమ రచనలలో హాస్యరసాను రంజకంగా మలచిన ప్రజ్ఞాశాలి కావడం హాస్య బ్రహ్మ అని కొనియాడ బడ్డారు. త్యాగరాజు రచనలను, జీవితాన్ని చక్కగా పరిశీలించి రాగ, తాళ, వాద్యాలను ఆ గాయకుని భావానికి అనుగుణంగా సమకూర్చుకుని 'త్యాగరాజు ఆత్మ విచారం' రచన చేశారు. తన అభిప్రాయాలకు అనుగుణంగా రచించిన తమ నాటకాలను రాజమండ్రి కళాశాల వార్షికోత్సవాలలో ఆయనే దర్శకత్వం వహించి ప్రదర్శించే వారు. ఆయన స్వయంగా నటులు కూడా. ద్విజేంద్రలాల్ రచించిన 'చంద్రగుప్త'లో శక్తి సింహ పాత్ర పోషణ ద్వారా ఖ్యాతిని పొందారు. కామేశ్వర రావు ఎక్కువగా నాటికలు ముఖ్యంగా హాస్య ప్రధానమైన రచనలు గావించారు. ఆయన నాటికలకు చాలాభాగం ఫ్రెంచి నాటక కర్త మోలియర్ వ్రాసిన నాటికలు ఆధారం. ఆయన అనేక విషయాల మీద వ్రాసిన వ్యాసాలు 20వ శతాబ్దపు మొదటి అర్థ భాగము లోని సామాజిక పరిస్థితులను తెలియ చేస్తాయి. ఆయన హాస్యం చదువరికి చురుక్కు మనిపిస్తుంది. ఆయన ఉత్తమ మైన హాస్య రచనలతో ఎందరినో మనసారా




భమిడిపాటి కామేశ్వరరావు ,Bhamidipati Kameswararao

నవ్వించిన 1958, ఆగష్టు 28 న పరమ పదించారు. భమిడిపాటి కామేశ్వర రావు అనేక హాస్య రచనల నుండి కొన్ని హాస్య పూరకమై, ఈనాటికి సందర్భ సందర్భో చితంగా ఉండేవి... వాటిల్లో కొన్ని తీసుకుంటే.. మన తెలుగు వ్యాసం నుండి......నూటికి నూరుమంది పైచిలుకు మాట్లాడే తెలుగు కలగాపులగమే. ఈ పులగంలో సంస్కృతం, పార్శీ, ఇంగ్లీషు మాత్రం జోరుగా పడ్డాయి. తెలుగు యొక్క మెత్తదనం వల్లనే ఇన్నిన్ని భాషల పదాలు బాణాల్లాగ హృదయంలో నాటే లాగ తెలుగులో గుచ్చుకుని ఉన్నాయి. తెలుగు శరీరంలో వాటిని నిల్చి ఉండనిస్తే అవి సెలలు వేసి ప్రాణం తీసేస్తాయ ని కొందరూ, లేక వాటిని పైకి లాగిపారేస్తే వెంటనే ప్రాణం పోకట అని కొందరూ. పరీక్షలు వ్యాసం నుండి... పరీక్షల కోసం, మార్కుల కోసం మాత్రమే బాధపడే వాడికి, విద్య అంటదు. విద్యకోసం పాటుపడే వాడికి పరీక్షవల్ల బాధే ఉండదు. ...జీవితం ఒక పెద్ద నిత్య పరీక్ష. జీవిత పరీక్షకి ఎప్పుడో తయా రు అవుతానులే అనడం కాక, అప్పటికప్పుడు తయారుగా ఉండడం మానవుడి విధి. పాలక సంఘాల్లో ఎన్నికల మజా అన్న వ్యాసం నుండి...జనం పంపిన మీదట పాలక సంఘంలోకి వెళ్ళి, వెంటనే ఆ జనాన్ని మరచి పోడమే ఎన్నికల్లో మజాబీ ఒకవేళ జ్ఞాపకం ఉంచుకున్నా, ఆ జనుల్లో మొదటి జనుడు తనేగదా అనుకోడం మరీ మజా. ఒకడు పాడు పన్లు చేస్తూ వుంటే, మనం కూడా, నెగ్గా లంటే, అంతకంటే పాడుపన్లు చెయ్యవలసి వచ్చేది ఎన్నిక ల్లోనే. ఎన్నికల నిఘంటువులో అసత్యం అధర్మం, అన్యాయం, ద్రోహం క్రౌర్యం, దారుణం లాంటి మాటలుండవు. గొంతు కేన్సర్ తో జీవిత చరమాంకంలో ఇంట్లో మంచం లో పడివున్న భమిడి పాటిని చూసేందుకు వచ్చిన బంధువు లు, మిత్రులకు ఆయన ఉన్న పరిస్థితి చూసి కళ్ళవెంట నీళ్ళు వచ్చే సందర్భంలో, అంత బాధలో కూడా "అరే, అప్పుడే ఏడుస్తా రెందుకు... ఆ కన్నీళ్ళకు ఇంకా కొంత సమయం ఉంది" అనే వారంటే భమిడిపాటి హాస్య చమత్కార ప్రియత్వం అర్థం అవుతుంది.

## ఆరోగ్య ప్రదాతలు క్రీడలే!

మన దేశ క్రీడా జెండాను విశ్వ ఒలంపిక్ క్రీడా వేదికగా మూడు సార్లు (1928, 1932, 1936) జయకేతనం ఎగురవేసిన బుందేల్‌ఖండ్ ఆణిముత్యం అత్యుత్తమ హాకీ క్రీడాకారుడు పద్మభూషనుడు మేజర్ ధ్యాన్‌చంద్? పుట్టిన రోజు 29 ఆగష్టు 1905ను భరతావని నలుమూలల "జాతీయ క్రీడా దినం"గా ప్రతియేట పాటించుట ఆనవాయితీగా మారింది. భారత వీర సైనికుడు ధ్యాన్‌చంద్? క్రీడా జీవితంలో (1926–48 మధ్య కాలంలో) 1000కి పైగా సార్లు హాకీ బంతితో గోల్స్‌ను ముద్దాడిన ఘనుడిగా ప్రతి ఒక్క భారతీయుడి మదిలో తిష్ట వేశారు. కోట్లాది భారత యువతను క్రీడల వైపుకు ఆకర్షించాలనే లక్ష్యంతో 1991–92లో నెలకొల్పిన దేశ అత్యుత్తమ క్రీడా పురస్కారం 'రాజీవ్‌గాంధీ ఖేల్ రత్న' అవార్డును 2021 నుంచి 'మేజర్ ధ్యాన్‌చంద్? ఖేల్ రత్న'గా పునర్ నామకరణం చేయడం కూడా ముదావహం. క్రీడాకారులకు ఇవ్వనున్న అవార్డులను ప్రముఖ క్రీడాకారుల పేరున ఇవ్వడం సముచితంగా తోస్తున్నది. 2016 నుంచి దేశ అత్యుత్తమ క్రీడాకారుడికి ప్రదానం చేసే పురస్కారం కూడా "ధ్యాన్‌చంద్? జీవన సాఫల్య అవార్డు"గా అందించడం మనకు తెలుసు. క్రీడలతో వ్యక్తిగతంగా శారీరక, మానసిక ఆరోగ్యం, యువతలో జీవన నైపుణ్యాలు, జీవన ఎత్తుపల్లాల నియంత్రణ, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, టీమ్ స్పిరిట్, శారీరక చురుకుదనం, ఒత్తిడి నిర్వహణ, ఆత్మవిశ్వాసాలను పెంచుటలో ఆటలు దోహదపడతాయి. గెలుపోటములను సమానంగా స్వీకరించడం క్రీడా స్ఫూర్తి నేర్పుతుంది. క్రీడలతో ఎముకల పటిష్టత, గుండె సంబంధ ఆరోగ్యం, స్థూలకాయాన్ని దూరం చేయడం, ప్రశాంత నిద్ర, శారీరక అవయవాల సమన్వయం, సమాజంలో గుర్తింపుతో పాటు ఆదర్శంగా నిలవడం, ఊపిరితిత్తుల ఆరోగ్యం, బిపి/షుగర్ నియంత్రణ, నిర్ణయం తీసుకునే నైపుణ్యం, రోగనిరోధక శక్తి పెరుగుదల, ఉద్యోగ సాధన లాంటి ముఖ్య ప్రయోజనాలు ఉన్నాయి. భారతదేశ అత్యుత్తమ చదరంగ ఆటగాడు, బాల మేధావి గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్?కు తొలి "ఖేల్ రత్న" పురస్కారాన్ని 1991–92లో ప్రదానం చేశారు. నాటి నుంచి నేటి వరకు ఈ అత్యుత్తమ పురస్కారాన్ని పొందిన క్రీడా దిగ్గజాల జాబితాలో పంకజ్ అదానీ (బిలియర్డ్స్ అండ్ స్నూకర్), రోహిత్ శర్మ (క్రికెట్), మరియప్ప (పారా అథ్లెటిక్స్), ఆర్ బి రమేశ్(చెస్ కోచ్), సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి(బ్యాడ్మింటన్) మనిక బాత్రా (టేబుల్ టెన్నిస్), వినేష్ పోగట్ (రెడ్లింగ్), గీతా సేతి (బిలియర్డ్స్), కరణం మల్లేశ్వరీ (వేయిట్ లిఫ్టింగ్), లియాండర్ పేస్ (టెన్నీస్), సచిన్ టెండూల్కర్ (క్రికెట్), ధన్‌రాజ్ పిల్లై (హాకీ), పుల్లెల గోపీచంద్? (బ్యాడ్మింటన్), అభినవ్ బింద్రా (షూటింగ్), అంజు బాబీ జార్జ్ (అథ్లెటిక్స్), రాజవర్ధన్ సింగ్ రాథోడ్ (షూటింగ్), మహేంద్ర సింగ్ ధోనీ (క్రికెట్), మేరీ కోమ్ (బాక్సింగ్), విజెందర్ సింగ్ (బాక్సింగ్), సుశీల్ కుమార్ (రెజ్లింగ్), సైనా నెహవాల్ (బ్యాడ్మింటన్), గగన్ నరంగ్ (షూటింగ్), సానియా మిర్జా (టెన్నీస్), పి వి సింధూ (షటిల్), సాక్షి మాలిక్ (రెజ్లింగ్), విరాట్ కోహ్లీ (క్రికెట్), రాణి రాంపాల్ (హాకీ), బజరంగ్ పునియా (రెజ్లింగ్), దీపా మలిక్ (పారాలంపిక్స్), మీరాభాయ్ చానూ (వేయిట్ లిఫ్టింగ్), సర్దార్ సింగ్ (హాకీ), దేవెంద్ర జజరియా (పారాలింపిక్స్), జీతూ రాయ్ (షూటింగ్), దీపా కర్మాకర్ (జిమ్నాస్టిక్స్), రోజన్ సోధీ (షూటింగ్), యోగేశ్వర్ దత్ (రెజ్లింగ్), విజయ్ కుమార్ (షూటర్), యం యస్ సంధూ (షూటింగ్), అంజలి భగత్ (షూటింగ్), బినామోల్ (అథ్లెటిక్స్), జ్యోతిర్మయి (అథ్లెటిక్స్), కుంజారాణి (వేయిట్ లిఫ్టింగ్), పుష్పేంద్ర కుమార్ (యాచింగ్), హోమి మోతివాలా (యాచింగ్), రవి కుమార్ (రెజ్లింగ్), మిథాలిరాజ్ (క్రికెట్), లవ్‌లీనా (బాక్సింగ్), శ్రీజేష్ (హాకీ) లాంటి పలు క్రీడాకారులకు చోటు దక్కించుకోవడం హర్షదాయకం. ఈ పురస్కారంలో భాగంగా పతకం, సర్టిఫికెట్, 25 లక్షల నగదు అందించి సన్మానిస్తారు. ఖేల్ రత్నకు తోడుగా అర్జున ఆవార్డు, ద్రోణాచార్య ఆవార్డులు కూడా ప్రదానం చేయడం మనకు విదితమే. ఆధునిక బాలలు/తల్లితండ్రులు ర్యాంకుల, మార్కుల వేటలో కొట్టుకుపోతున్నారు. నేటి స్మార్ట్ చదువులకు తోడుగా క్రీడలు కూడా తోడైతేనే పిల్లల సమగ్రాభివృద్ధి సుసాధ్యం అవుతుందని తల్లితండ్రులు, విద్యార్థులు తెలుసుకోవాలి. మన విద్యలో క్రీడలు ప్రధాన భాగం కావాలి. ఆటలు పిల్లల ముఖాల్లో సంతోష పువ్వులు పూయించాలి. క్రీడా ప్రాంగణం చెమటతో తడిసి ముద్ద కావాలి. యువతలో నిస్సత్తువ తరిమి వేవాలి. క్రీడాకారుడిగా పతకాల పంట పండించాలి. జాతీయ పతాక రెపరెపలను విశ్వవ్యాప్తం చేయాలి. నిర్వీర్య యువతలో క్రియాశీలతను జోడించుటకు ఆటపాటలు ఉపకరణాలుగా మారాలి. ఆటలు కూడా ఉద్యోగాలను పొందడానికి మార్గమని తెలుసుకోవాలి. నేటి యువభారతం క్రీడా నైపుణ్య జ్ఞానంతో ధ్యాన్‌చంద్? వారసుడిగా దేశ క్రీడా ప్రతిష్టను ఇనుమడింపజేయాలి. క్రీడలు కీర్తి తోరణాలు, ఆటలు అమూల్య ఆరోగ్య ప్రదాతలని రుజువు చేయాలి.

## మాటల మాంత్రికుడు నరసరాజు

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తన రచనతో ఎన్నో మరపురాని చిత్రాలను అందించిన ప్రసిద్ధ రచయిత డి.వి. నరసరాజు. సినీ కథ, సంభాషణల రచయితగా సుప్రసిద్ధులు. ఆయన రచించిన సినిమాలలో హాస్యరసం తొణికిస లాడుతూ ప్రేక్షకుల్ని నవ్వించింది. తెలుగు పలుకుబడిని ఉపయోగించడంలో నరసరాజు అందెవేసిన చేయి. జన సామాన్య వాడుక లోని పదాలతోనే వాడి హాస్యం వ్యంగ్యం పండించిన కృషీవలుడు డి.వి.నరసరాజు. ఆయన మౌలికంగా నాటక రంగం తెలుగు పలుకు బడిని ఉపయోగించడంలో అందెవేసిన చేయి. డి.వి. నరసరాజుగా ప్రసిద్ధుడైన దాట్ల వెంకట నరసరాజు (జూలై 15, 1920 – ఆగష్టు 28, 2006) రంగస్థల, సినిమా నటుడు, రచయిత, దర్శకుడు. 1920 జూలై 15న గుంటూరు జిల్లా, సత్తెనపల్లి మండలంలోని తాళ్లూరులో జన్మించాడు. ఆయన హేతువాది. నరసరాజు గుంటూరులోని హిందూ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని, హిందూ కళాశాలలో ఇంటర్ తర్వాత మద్రాసు లయోలా కళాశాల నుండి బి.ఏ పూర్తి చేశాడు. ఇప్పుడు విజయవాడలో కలసి పోయిన ముత్యాలంపాడు గ్రామంలో తొలి గ్రాడ్యుయేట్ దాట్ల వెంకట నరసరాజు. నాటక రచయితగా జీవితాన్ని ప్రారంభించాడు. సినిమాల లోకి రాకముందు నాటక రచయితగా పేరు తెచ్చు కున్నాడు. అంతర్వాణి, ఈ ఇల్లు అమ్మ బడును, వాపసు లాంటి సూపర్ హిట్ నాటకాలు రాశాడు. ఈనాడు పత్రికలో కొంతకాలం పనిచేశాడు. మొదటి నుంచి సృజనాత్మక కళల మీదే నరసరాజు దృష్టి. 1951లో పాతాళభైరవి సినిమా వందరోజుల ఉత్సవం సందర్భంగా ప్రదర్శించ బడిన నరసరాజు నాటకం "నాటకం" చూసాడు దర్శకుడు కె.వి.రెడ్డి. ఆయన ప్రతిభ చూసిన దిగ్దర్శకులు కేవీ రెడ్డి తన 'పెద్ద మనుషులు' చిత్రం ద్వారా నరసరాజును చిత్రసీమకు పరిచయం చేశారు. అలా నరసరాజు 1954లో పెద్ద మనుషులు సినిమాతో రచయితగా సినీరంగ ప్రవేశం చేశాడు. ఆ సినిమా విజయవంతం కావడంతో సినీ రచయితగా స్థిరపడ్డాడు. దొంగ రాముడు మూవీకి రచయితగా డి.వి.నరసరాజునే తీసుకున్నారు. గుండమ్మ కథకు మాటలు రాశాడు. రాముడు భీముడును సూపర్ డూపర్ హిట్ కొట్టించాడు. నరసరాజుతో ఎన్టీఆర్‌కు ఎక్కువ సాన్నిహిత్యం ఉండేది. తన స్వీయ నిర్మాణంలో తెరకెక్కిన సాంఘిక చిత్రాలకు ఎక్కువగా నరసరాజుకే స్క్రిప్ట్ బాధ్యతలు అప్పగించేవారు ఎన్టీఆర్. అలా రూపుదిద్దుకున్న చిత్రాల్లో కోడలు దిద్దిన కాపురం ఒకటి. బడి పంతులు డైలాగ్స్ కోసం డబ్బులు తీసుకున్న ఆత్రేయ రాయని స్థితిలో చివరకు నరసరాజు పూర్తి చేయాల్సి వచ్చింది. యన్టీఆర్ హీరోగా రూపొందిన "నాదీ ఆడజన్మే, సి.ఐ.డి., తిక్క శంకరయ్య, బడి పంతులు, వాడే–వీడు, మగాడు, యమగోల, కేడీ నంబర్ వన్, యుగంధర్ లాంటి చిత్రాలలో ఆయన చిరకాలం గుర్తుండేలా రచనలు చేశారు. అక్కినేని హీరోగా రూపొందిన మూగనోము, గృహలక్ష్మి, జై జవాన్, ఇద్దరు అమ్మాయిలు, శ్రీరంగనీతులు, రావుగారిల్లు చిత్రాలకు నరసరాజు రచన చేశాడు. చిత్రపు నారాయణ మూర్తి తీవ్రమైన కష్టాల్లో ఉన్న పరిస్థితి చూసి సాధారణంగా పౌరాణికాలు పెద్దగా అంగీకరించని నరసరాజు భక్త ప్రహ్లాదకు పని చేశారు. రంగుల రాట్నం, రాజ మకుటం లాంటి సినిమాలు ఆయన ఖాతాలోకే వస్తాయి. యమగోల చిత్రంలో చాలా పొలిటికల్ డైలాగులు పేల్చి నరసరాజు జనంతో ఈలలు కొట్టించు కున్నారు. ఎమర్జన్సీ మీద కాంగ్రెస్ పార్టీ మీద చాలా సెటైర్లు రాయగా, తెర మీద చెప్పేది ఎన్టీఆర్ కావడంతో ఆ డైలాగ్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. నాటకం' అనే నాటకంతో రంగస్థలం మీద సంచలనం సృష్టించిన డి.వి.నరసరాజు తెర మీద కూడా రెండు సినిమాల్లో నటించారు. ఒక సినిమాకు దర్శకత్వం వహించాడు. అలా నరసరాజు 92కు పైగా సినిమాలకు కథను, మాటలను సమకూర్చాడు. ఆయన దర్శకత్వం వహించిన కొన్ని సినిమాలలో కారు దిద్దిన కాపురం ఒకటి.

# మలేరియా,డెంగ్యూ సీజనల్ వ్యాధులు, జ్వరాల నియంత్రణకు తగినచర్యలు చేపట్టాలి





జిల్లా కలెక్టర్ శశాంక వైద్య అధికారులకు ఆదేశం.

**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, ఆగస్టు 27 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** మంగళవారం రంగారెడ్డి జిల్లా కొండాపూర్ లోని ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ శశాంక ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బంది తోపాటు పేషెంట్లకు సంబంధించిన వార్డులను పరిశీలించారు. ప్రస్తుతం మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సోకి ఆసుపత్రులకు వచ్చిన వారికి సరైన వైద్యం అందించాలని, ఏరియా ఆసుపత్రి పరిధిలోని ప్రజలకు సీజనల్ వ్యాధులు సొకాకుండ తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని వైద్య అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ సగటున ఎంతమంది రోగులు ఆసుపత్రికి వస్తున్నారు, వారిలో ఎంతమంది ఇన్ పేషంట్లుగా అడ్మిట్ అవుతున్నారు, డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు వంటి



వాటితో ఎంతమంది ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారనే వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఏరియా ఆసుపత్రిలో వైద్యం తీసుకుంటున్న రోగులను పలకరించి అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఏరియా ఆసుపత్రికి వైద్యం కొరకు ఎక్కడెక్కడి నుండి ప్రజలు వస్తారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వచ్చిన వారికి సరైన వైద్యం అందించాలని, ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు. టెస్టులు నిర్వహించి వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు.

ముఖ్యంగా జ్వరాలతో ఆసుపత్రులకు వచ్చే ప్రతి ఒక్కరికి రక్త నమూనాల సేకరణ, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్, డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా, మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈతనిఖీలో డాక్టర్ జి.రాజు,డిసిహెచ్ఎస్, డాక్టర్ జి.అనురాగిణి రెడ్డి,

మెడికల్ సూపరింటెండెంట్, డాక్టర్ చంద్రకృష్ణ ఆర్ఎమ్ఓ, డాక్టర్ సుధాకర్, సీఎస్ జనరల్ మెడికల్, హేమలత, న్యూరో సూపరింటెండెంట్, శ్రీమతి హెప్సిభా, ఇన్ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్, డాక్టర్ అపర్ణ, టి హబ్ ఇంచార్జి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కారులో గంజాయి తరలిస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర ముఠా వ్యక్తులు అరెస్టు





**60 కిలోల గంజాయి, స్విఫ్ట్ కారు, మూడు మొబైల్స్, 1500 రూపాయలు స్వాధీనం**

**మాదక ద్రవ్యాల రహిత నియోజకవర్గంగా మార్చాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్న పోలీసులు**

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 27 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** గంజాయి తరలిస్తున్న అంతరాష్ట్ర ముఠా ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన ఇబ్రహీంపట్నం పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే సిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ సి పి సుధీర్ బాబు మాట్లాడుతూ నిందితుల నుండి 60 కిలోల గంజాయి, స్విఫ్ట్ కారు, 3 సెల్ఫున్లు, రూ.1500 స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ఉదయం ఎస్ఓటీ మహేశ్వరం జోన్ బృందం, ఇబ్రహీంపట్నం పోలీసులతో కలిసి సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని రాయపోల్ గ్రామం వద్ద మారుతీ స్విఫ్ట్ కారును అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 60 కిలోల గంజాయి లభించింది. కారులోని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, నిందితులు ఇద్దరు మహారాష్ట్ర కు చెందిన వాల్మిక్ రూపమోహిత్, ఐతుదేవాం చవాన్ లుగా గుర్తించామన్నారు. రవాణ వాహనం కలిగిన వాల్మిక్ రూపమోహిత్ తన బంధువు భటుడేం ను హెల్పర్, కోడ్రైవర్ తీసుకున్నాడు. ఐతుదేవాం గంజాయికి బానిసైయ్యాడు. ఆరు నెలల క్రితం మహారాష్ట్ర నుండి విశాఖపట్నం కూరగాయల మార్కెట్ కు ఉల్లిలోడులో తరలిస్తూ ఏపీ రాష్ట్రంలోని అరకు కు చెందిన తిరుపతి ద్వారా, వైజాగ్ మార్కెట్ లో గంజాయిని వినియోగిస్తున్నాడు. అప్పటి నుండి తిరుపతిని తరచుగా గంజాయి వ్యాపారం గురించి ఇద్దరిని సంప్రదించేవాడు. కాగా వాల్మీకి రూపమోహిత్ గత కొంత కాలంగా చేసే రవాణా వ్యాపారంలో నష్టం రావడంతో తన వాహనాన్ని విక్రయించాడు. ఇదిలా ఉండగా గంజాయిని మహారాష్ట్రకు అక్రమంగా తరలించి అధిక ధరలకు విక్రయించి, లాభాలు పొందాలని పథకం వేశారు. పథకంలో భాగంగా ఓ మారుతీ స్విఫ్ట్ కారు కొనుగోలు చేశారు. గంజాయి కోసం తిరుపతిని సంప్రదించారు. తిరుపతి ఓకే చెప్పిన తర్వాత ఈ నెల 25న వీరిద్దరూ కలిసి తమ మారుతీ కారులో విశాఖపట్నం జిల్లాలోని పెందుర్తి గ్రామానికి వెళ్లారు. అక్కడ వారు తిరుపతిని కలుసుకుని 60 కిలోల గంజాయిని తీసుకున్నారు. నిందితులు ఆద్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నకిలీ నంబర్ ప్లేటును ఉపయోగించారు.యూపీ రాష్ట్రంలో గంజాయిని సేకరించిన తర్వాత పోలీసులను తప్పుదారి పట్టించేందుకు అసలు నెంబర్ ప్లేటు అతికించి, తమ కారులో 30 ప్యాకెట్ల గంజాయిని తీసుకుని ఆంధ్రప్రదేశ్ లోని పెందుర్తి నుండి మహారాష్ట్రలోని నాసిక్ కు ప్రయాణం ప్రారంభించారు. పోలీసులు తనిఖీలు చేయకుండా ఉండేందుకు రాజముహేంద్రవరం, విజయవాడ, మార్యాపేట, చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం మీదుగా మార్గాన్ని ఎంచుకున్నారు. రాయపోల్ గ్రామ సమీపంలోకి రాగానే కారుతో పాటు నిందితులు పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. గంజాయి సరఫరా చేస్తున్న తిరుపతి కోసం గాలిస్తున్నామని, తీసుకొని కేసు నమోదు చేశామని సమావేశంలో తెలిపారు.

## గట్టుపతి వెంకటేశ్వర స్వామి ఆవరణలో ఘనంగా ఉట్ల కార్యక్రమం





**భారీగా తరలివచ్చిన భక్తులు**

**యాదవ బాలురచే ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహణ**

**సుమారు 200 మందికి అన్నదానం**

**చింతపల్లి పండితులచే ప్రత్యేక పూజలు**

**చింతపల్లి, ఆగస్ట్ 27 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** హిందూ పంచాంగం ప్రకారం ప్రతి ఏడాది శ్రావణమాసం కృష్ణపక్షంలో వచ్చే అష్టమి తిథినాడు ప్రపంచవ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయం. ప్రతి ఇంట్లోనూ పిల్లలను బాలకృష్ణుడిగా అలంకరించి సంబరాల్లో మునిగిపోతారు శ్రీ కృష్ణుడికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు తమ జీవితాల్లో కష్టాలు తొలగిపోయి సుఖసంతోషాలు నిండాలని కోరుకుంటారు. ఈ క్రమంలో చింతపల్లి మండల కేంద్రంలో గల గట్టుపతీ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదిత్యని మహేందర్ శర్మ, ఆదిత్యని సత్యనారాయణ శర్మ ఆదిత్యని భాస్కర్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల సాక్షిగా మంగళవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ జరగా వైభవంగా జరిగాయి. ప్రత్యేక పూజల అనంతరం యాదవ సంఘం నాయకులు, యాదవ బాలురు, గ్రామ పెద్దలు, యువకులు పూజలలో పాల్గొని అనంతరం భజనతో ఆలయ ప్రదక్షిణలు చేసి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సుమాహ్మందికి పైగా అన్నదానం నిర్వహించారు అనంతరం సాయంత్రం సమయంలో యాదవ బాలురచే ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు.అనంతరం సత్యనారాయణ శర్మ మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయ వలసినటువంటి బాధ్యత నేటి తరం మీద ఉన్నదని అన్నారు. ఉట్లు కొట్టే కార్యక్రమంలో కుండ చీకటికి ప్రతీక అయితే అందులో వేసే నెయ్యి, వెన్న, పాలు, పెరుగు వెలుగుకు (జ్ఞానానికి) ప్రతీక అని అన్నారు. దిగంతాల చీకటి నుండి యుగాంతల వెలుగులోకి తీసుకురావడమే శ్రీకృష్ణ జన్మాష్టమిలో ఉట్లు కొట్టే సాంప్రదాయమని, ఆదిత్యని సత్యనారాయణ శర్మ, మహేందర్ శర్మ, భాస్కర్ శర్మ అన్నారు. బంకమట్టిలో చర్మ రోగాలు నయం చేసేటటువంటి లక్షణాలు ఉంటాయని అందుకే బంకమటీలో ఉట్లు కొట్టే శాస్త్రం సంప్రదాయం రెండు కలిసి ఉంటాయనేది తెలియజేయడమే శ్రీ కృష్ణాష్టమి ప్రత్యేకత అని అన్నారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి వెంకటయ్య, ఆదిత్యని శ్రీనయ్య, శివర్ల రమేష్ యాదవ్, కుకుడపు రామకృష్ణ, ఎల్లంకి రవి, గజ్జ అభినవ్ మురళి, జనిగల సైదులు, మోర వెంకటరమణ,ఉప్పల యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కొండమల్లేపల్లి లో"మిస్టర్ చాయ్" టీ స్టాల్ ప్రారంభం

**రిబ్బన్ కట్ చేసి షాపును ప్రారంభించిన ఎస్సై ముత్యాల రామ్మూర్తి**




**కొండమల్లేపల్లి, ఆగస్టు 27 శాసనసభ న్యూస్:** మిస్టర్ చాయ్ టీ స్టాల్ ను హైదరాబాద్ రోడ్డు నందు కొండమల్లేపల్లి పట్టణంలోని పోలీస్ స్టేషన్ కు సమీపంలో సోమవారం స్థానిక ఎస్సై ముత్యాల రాంమూర్తి చేతుల మీదుగా "మిస్టర్ ఛాయ్" టీ స్టాల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తన ఆశయాలకు అనుగుణంగా వ్యాపార రంగంలో రాణించాలని ఎందరికో ఆదర్శంగా నిలవడంతో పాటు ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేయాలని కోరుకుంటున్నట్లు ఎస్సై అన్నారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోకూడదని సమాజంలో గౌరవించబడే విధంగా జీవితాన్ని కొనసాగించాలని,చిన్న వయసులో వ్యాపార రంగంపై దృష్టి సారించిన మిస్టర్ ఛాయ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఉట్కూరి వేమన్ రెడ్డి, మాజీ వార్డ్ సభ్యులు ఎలిమినేటి సాయి, ప్రొప్రైటర్లు శ్రీధర్, నవీన్, బత్తుల జగదీశ్, సైదులు, యాదగిరి, సైదులు, కృష్ణ, పర్వతం కొండలు తదితరులు పాల్గొన్నారు.

## ఈదమ్మతల్లీ దీవించమ్మా..




**కల్వకుర్తి ఆగస్టు 27(శాసన సభ ):** ఈదమ్మ తల్లీ.. దీవించమ్మా అంటూ వేడుకుంటూ రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని ఆడపడుచులు అందరూ భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేకంగా బోనాలు అలంకరించి డప్పు చప్పులతో ఈదమ్మ తల్లికి దగ్గరికిఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించారు.

## అమ్మో... క్యాంప్ ఆఫీసులా...

**వరంగల్ : :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాలు బోసి పోతున్నాయి. క్యాంప్ ఆఫీసులోకి కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలు అడుగుపెట్టడం లేదు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని క్యాంప్ కార్యాలయాలు గెస్ట్ హౌస్ లగా... గెస్ట్ హౌస్ లు క్యాంప్ కార్యాలయాలుగా మారాయి. మరికొన్ని తాళాలు తెరుచుకోవడం లేదు. కొందరు ఇగో మరికొందరు వాస్తు అనుమానంతో ఎమ్మెల్యేలు క్యాంప్ ఆఫీస్ లకు వెళ్ళడం లేదనే ప్రచారం జరుగుతుంది. ఎమ్మెల్యేలు నియోజకవర్గ కేంద్రంలో అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లను నిర్మించింది. నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంతో పాటు నివాసం ఉండే విధంగా నిర్మించడం జరిగింది. ఒక్కో క్యాంప్ ఆఫీసు ను ఒక కోటి బడ్జెట్ తో నియోజకవర్గాల్లో నిర్మించింది బీ అర్ ఎస్ ప్రభుత్వం. రాష్ట్రంలో కొత్తగా క్యాంప్ కార్యాలయాలు నిర్మాణం కావడంతో బీఅర్ఎస్ ఎమ్మెల్యేలతో పాటు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు క్యాంప్ కార్యాలయాల్లోకి వెళ్ళారు. 2023 ఎన్నికల్లో గెలిచిన గతంలో ఎమ్మెల్యేగా ఉండి తిరిగి గెలిచిన వారు కొనసాగగా.. కొత్తగా గెలిచిన వారు క్యాంప్ కార్యాలయాల్లో అడుగు పెట్టడం లేదు.ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11 ఎమ్మెల్యేలు అండగా కొందరు క్యాంప్ ఆఫీసు ముఖం చూడకపోతే.. మరికొందరు వెళ్ళమా కొద్ది సేపు ఉన్నామా అన్న విధంగానే ఉన్నారు. నర్సంపేట ఎమ్మెల్యేగా గెలిచిన దొంతి మాధవ రెడ్డి క్యాంప్ ఆఫీసు ముఖం చూడలేదు. గతంలో ఎమ్మెల్యే గా ఉన్న సుదర్శన్ రెడ్డి ఓడిపోగానే ఖాళీ చేసి వెళ్ళారు. మాధవ రెడ్డి క్యాంప్ కార్యాలయం కు వెళ్ళలేదు. మాధవ రెడ్డి నర్సంపేట నుండి రెండవ సారి ఎమ్మెల్యేగా గెలిచారు. మాధవరెడ్డి ఎవరు ఏమనుకున్నా ఎన్ని విమర్శలు వచ్చిన తనకు నచ్చినట్టు చేస్తారు. క్యాంప్ ఆఫీస్ విషయంలో కూడా ఇదే జరిగింది. వెళ్ళనంటే వెళ్లనని నర్సంపేట క్యాంప్ ఆఫీస్ ను ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ గా మార్పు చేసి. ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ను ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ గా మార్చుకున్నారు. గెస్ట్ హౌస్ ను క్యాంప్ ఆఫీస్ గా మార్చుకొని ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. మాధవ రెడ్డి పై ఎన్ని విమర్శలు వచ్చిన పట్టించుకోవడంలేదు. ఇక మరో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి. పాలకుర్తి నియోజకవర్గం నుండి గెలిచిన అతిచిన్న వయసులో గెలిచిన ఎమ్మెల్యే. అంతేకాదు ఓటమి ఎరుగని దయాకర్ రావు పై విజయం సాధించి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందారు. యశస్విని రెడ్డి క్యాంప్ ఆఫీసు లోకి వెళ్ళడంలేదు. వాస్తు దోషం ఉందనే కారణంతో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి క్యాంప్ కార్యాలయానికి వెళ్ళడంలేదట. మరో ప్రచారం లేకపోలేదు. రాజకీయంగా అనేక ఇబ్బందులకు గురిచేసిన దయాకర్ రావు ఉన్న ఆఫీస్ లోకి వెళ్ళడం లేదనే ప్రచారం లేకపోలేదు. యశస్విని రెడ్డి తొర్రూరు లోని నివాసం వద్ద ప్రజలకు అందుబాటు ఉంటూ పాలనను సాగిస్తున్నారు.

## హైడ్రాపై సొంత పార్టీలోనే వ్యతిరేకత

**హైదరాబాద్ :** తెలంగాణలో రాజకీయం అంతా ఇప్పుడు హైడ్రా కూల్చివేల చుట్టూ తిరుగుతోంది. హైడ్రాకు మద్దతుగా ప్రజలు ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ... చెరువుల్ని కబ్జాల నుంచికాపాడకపోతే తన బాధ్యతను సరిగ్గా నిర్వర్తించనట్లేనని.. సొంత వాళ్లు ఉన్నా సరే వదిలి పెట్టబోనని ప్రకటించేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఇప్పటి వరకూ హైడ్రా కూల్చివేతలకు మద్దతుగా మాట్లాడుతున్న వారు చాలా పరిమితంగానే ఉన్నారు. కానీ వ్యతిరేకించేవారు మాత్రం.. ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇది రాజకీయంగా కీలకమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. హైడ్రా కూల్చివేతలు చెరువుల్ని కబ్జా చేసిన వారి భరతం పట్టడానికనని చెబుతున్నారు. కానీ ఈ చెరువుల్ని సామాన్యులు ఎవరూ కబ్జా చేయలేరు. సామాన్యులు చెరువు శిఖం భూమిలో చిన్న షెడ్డు కూడా వేయలేడు. కానీ రాజకీయ నేతలు .. చేతిలో అధికారం ఉన్న వారు మాత్రం.. శిఖం భూములే కాదు.. భారీ అంతస్తుల నిర్మాణాలు కూడా పూర్తి చేస్తారు. వారికి అడ్డం ఉండదు. గత పదిహేను..ఇరవై ఏళ్లుగా వివిధ చెరువులను కబ్జా చేయడం.. శిఖం భూముల్లో ఉన్న నిర్మాణాలన్నీ రాజకీయ నేతలు.. వారి అనుచరులు... బినామీల నిర్వాకాలే. ఆ పార్టీ.ఈ పార్టీ అనే తేడా ఉండదు. అందరిదీ అదే పని. అందుకే ఇప్పుడు అలాంటి కట్టడాలను కూలగొడితే ఖచ్చితం?గా పొలిటికల్ ఎఫెక్ట్ వస్తుంది. అది ఇప్పుడు ప్రాథమిక స్థాయిలో తెలంగాణ సర్కార్ పై కనిపిస్తోంది. దానం నాగేందర్ హైడ్రా కూల్చివేతలపై బహిరంగ వ్యతిరేకత వ్యక్తం చేశారు. నిజానికి ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యే. కానీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన అసంతృప్తితో రేవంత్ రెడ్డికి పెద్దగా నష్టం జరిగేమీ ఉండదని అను?కుంటున్నారు. కానీ హైదరాబాద్‌కు సంబంధం లేకపోయినా అనేక మంది కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు.. వారి బంధువుల వ్యాపారాలు హైదరాబాద్‌లోనే ఉంటాయి. అవి కూడా ఎక్కువ భూమితోనే ముడిపడి ఉంటాయి. హైడ్రా కూల్చివేతల పరంగా చూస్తే కాంగ్రెస్ నేతల ఫామ్ హౌస్‌లు.. ఇతర వాటిపై విరుచుకుపడక తప్పని పరిస్థితి కనిపిస్తోంది. లేకపోతే రేవంత్ చిత్తశుద్ధిపై ప్రజలకు అనుమానాలొస్తాయి.

# సీజనల్ జ్వరాల వ్యాప్తి కట్టడికి పటిష్ట చర్యలు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**నీరు నిల్వ ఉండటం వల్ల వచ్చే ప్రమాదాలపై విస్తృత ప్రచారం**

**పరిసరాల అపరిశుభ్రత కారణంగానే విషజ్వరాలు వ్యాప్తి**

**మంథని మండలంలోని గుంజపడుగు గ్రామంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్**



**మంథని :** గ్రామాలలో సీజనల్ జ్వరాల వ్యాప్తి కట్టడి చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని మండలం గుంజపడుగు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గుంజపడుగు గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం, వైరల్ జ్వరాలకు గురైన గ్రామస్థుల ఇండ్లను పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ వర్షాకాలంలో నిల్వ ఉన్న నీటిలో దోమలు వ్యాప్తి చెంది వైరల్ జ్వరాలు, డెంగ్యూ, మల్లేరియా చికెన్ గున్యా మొదలగు జ్వరాల వ్యాప్తి దారి తీస్తాయని, ఇండ్లలో ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత ద్వారా మాత్రమే వైరల్ జ్వరాల ను అరికట్టవచ్చని కలెక్టర్ తెలిపారు. వైరల్ జ్వరాలు వచ్చిన ఇండ్లలో నీరు నిల్వ ఉండటం గమనించిన కలెక్టర్ వెంటనే నిల్వ చేసిన నీటిని , ఆ స్థలాన్ని శుభ్రం చేయించారు. నీరు నిల్వ ఉండటం వల్ల వచ్చే ప్రమాదాలపై గ్రామంలో విస్తృతంగా ప్రచారం కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రోడ్లపై కూడా ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, నీరు నిల్వ ఉన్న పక్షంలో దోమలు రాకుండా ఆయిల్ బాల్స్ వినియోగించాలని అన్నారు. గ్రామంలో రెగ్యులర్ గా ఫాగ్గింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. పరిసరాల అపరిశుభ్రత కారణంగా డెంగ్యూ, మల్లేరియా మొదలగు వైరల్ జ్వరాల వ్యాప్తి పెరిగి ప్రజల ఆరోగ్యం దెబ్బ తింటుందని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి ఆశ లత, డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్ మంథని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పూర్ణ చందర్ రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రాకు మరిన్ని అధికారాలు...



**హైదరాబాద్ :** హైదరాబాద్‌ను గత ప్రభుత్వం విశ్వనగరంగా తీర్చిదిద్దింది. ఇందుకోసం మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రత్యేక చొరవతో అభివృద్ధి చేశారు. దీంతో పెట్టుబడులు భారీగా వచ్చాయి. ఐటీరంగం గణనీయంగా అభివృద్ధి చెందింది. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హైదారాబాద్ అభివృద్ధిపైనే ప్రధానంగా దృష్టిపెట్టింది. ఎన్నికల్లో జీహెచ్ఎంసీ పరిధిలో ఒక్క సీటు గెలవకపోయినా.. రాష్ట్ర రాజధానిని ఫ్యూచర్ సిటీగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా ఇటీవలే అమెరికా, దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లొచ్చారు. భారీగానే పెట్టుబడులు వచ్చేలా ఎంవోయూ చేసుకున్నారు. ఇదిలా ఉంటే.. హైదరాబాద్‌కు పెట్టుబడులు రావాలంటే.. ముందుగా ముంపు సమస్య తొలగిపోవాలని భావించారు. అందుకు కబ్జాలే కారణమని గుర్తించారు. ఈ క్రమంలో వందలాది చెరువులను కబ్జాల చెర విడిపించాలని నిర్ణయించారు. ఇందుకోసం హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్సిబుల్ అసెట్) ఏర్పాటుచేశారు. పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. దీంతో నెల రోజులుగా హైడ్రా పని మొదలు పెట్టింది. రాజకీయ నాయకులు, అధికార పక్షం, ప్రతిపక్షం, సెలబ్రిటీలు అనే తేడా లేకుండా కబ్జాలను కూల్చివేస్తోంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలోని ఆక్రమణలను తొలగిస్తోంది. భవనాలను నేలమట్టం చేస్తోంది. తాజాగా ప్రముఖ సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేసింది. మరోవైపు జన్వాడలోని కేటీఆర్ ఫామ్ హౌస్‌గా భావిస్తున్న భవనాన్ని కూల్చేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో కేటీఆర్ స్నేహితుడు హైడ్రాపై కోర్టును ఆశ్రయించాడు. దీంతో కోర్టు హైడ్రా పరిధి, అధికారాలు, చట్టబద్ధతను ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో హైడ్రాకు మరింత పవర్ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.'హైడ్రా అనేది ఒక కార్యనిర్వాహక వ్యవస్థ. ఇది జీవో నెం.99 ద్వారా ఏర్పడింది. జులై 19న ఇది జీవో వచ్చింది. జీవోలకు సహజంగానే చట్టబద్ధత ఉంటుంది. గతంలో ఇదే విధంగా 1985లో ఒక జీవో ద్వారా ఏసీబీ ఏర్పడింది. అదే విధంగా జీవో ద్వారా విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ వ్యవస్థ కూడా ఏర్పడింది. ఇలా జీవో ద్వారా ఏర్పడిన సంస్థలకు రాజ్యాంగ పరంగా కార్యనిర్వాహక అధికారం ఉంటుంది. గతంలో ప్లానింగ్ కమిషన్, లా కమిషన్ కూడా ఇలాగే కార్యనిర్వాహక ఆదేశాలతో ఏర్పడ్డాయి. జీవోల ద్వారా ఏర్పడిన వ్యవస్థలకు చట్టబద్ధత ఉండదు అనడానికి లేదు. ఆక్రమణల తొలగింపు అనేది స్థానిక సంస్థల భాగస్వామ్యంతో చేపట్టాలన్నది హైడ్రా జీవోలోనే ఉంది. ఆ ప్రకారమే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను తొలగిస్తుంది. బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. హైడ్రాకు పోలీస్ స్టేషన్ స్టేటస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనివల్ల నేరుగా హైడ్రానే ఎఫ్ఐఆర్ ఫైల్ చేసేందుకు వెసులుబాటు కలుగుతుంది. దీనిపై ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడనున్నట్లు సమాచారం. ఇక హైడ్రా కూల్చివేసిన భవనాలకు గతంలో పర్మిషన్ ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకునే విషయంపై ఉన్నతాధికారులతో ప్రభుత్వం చర్చలు జరుపనుంది.

# కరీంనగర్‌కు కాడ్రా..... పబ్లిక్ డిమాండ్



**కరీంనగర్ :** కంచే చేను మేసినట్లు.. ప్రభుత్వాస్తులను రక్షించే వారే భక్షించారు.. గత పాలనలో కోట్లాది రూపాయల భూములను చెరబట్టారు. పేదలు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది. తిరిగి వారి పైనే పోలీసులు కేసు నమోదు చేసిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీన్ రివర్స్ అయింది.. పేదల భూములు కబ్జా చేసిన పలువురు కటకటాల పాలయ్యారు. అలాగే ప్రభుత్వం భూముల పరిరక్షణకు కాడ్రా ఏర్పాటు చేయాలని డిమాండ్ వినిపిస్తున్నది.

బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో వారు వాడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఎవరైనా అడ్డు చెబితే అంతే సంగతులు. గతంలో ఒక మంత్రిగా వ్యవహరించిన ముఖ్య నేత పేరు చెప్పుకొని అనుచరు సాగించిన అరాచకం అంతా కాదు. కోట్లలో ఉండే ప్రభుత్వ భూములతో పాటు పేదల భూములను కూడా చెరపడ్డారు. ఎదురు తిరిగిన వారిపైనే తమకున్న పలుకుబడిని ఉపయోగించి ఉల్టా కేసులు నమోదు చేయించి జైలు పాలు చేశారు. పదేళ్ల కాలం పాటు వారి హవా కొనసాగింది. పోలీసులు, అధికారులు కూడా కిమ్మనకుండా అడ్డు చెప్పలేకపోయారు. ప్రభుత్వం మారింది.. సీన్ రివర్స్ అయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ భూముల కబ్జాపై ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాదులో వేల కోట్ల రూపాయల చెరువులు, కుంటలు ఇతర ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. వీటి పరిరక్షణతో పాటు ఇకముందు కూడా కబ్జా కాకుండా ఇతర దేశాలో అధ్యయం చేసిన తర్వాత హైడ్రాను అనే ప్రత్యేక ముఖ్యమంత్రి ఏర్పాటు చేశారు. దానికి సంపూర్ణ అధికారాలు అప్పగించారు. చెరువులు, కుంటలు ఎఫ్టిఎల్, బఫర్ జోన్లలో చేపట్టిన అక్రమాణలపై హైడ్రాధికారులు ఉక్కు పాదం మోపుతున్నారు.బీఆర్ఎస్ హాయంలో కరీంనగర్ తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో విపరీతమైన భూకబ్జాలు జరిగాయి. పేదలు సామాన్యులను సైతం నానా ఇబ్బందులకు గురిచేసి వారి భూములను సైతం చెర పెట్టారు.ప్రభుత్వ స్థలాల్లో అక్రమణాలపై ఉక్కు పాదం మోపుతున్న హైదరాబాద్ హైడ్రా లాగా కరీంనగర్ కు ఒక కాడ్రా ఏర్పాటు చేయాలని అంశం ప్రజల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయి. ప్రభుత్వాస్తుల పరిరక్షణ, కబ్జాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా అనే ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశారు. చెరువులు, కుంటల్లో ఫుల్ ట్యాంక్ లెవెల్ బఫర్ జోన్లలో చేపట్టిన నిర్మాణాలపై హైడ్రా ఉక్కు పాదం మోపుతున్నది. గత బిఆర్ఎస్ పాలనలో కరీంనగర్తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో విచ్చలవిడిగా భూములు కబ్జాకు గురయ్యాయి. అడ్డు అదుపు లేకుండా వేలకోట్ల రూపాయల భూములు అన్యాక్రాంతమ య్యాయి. గతంలో మంత్రిగా వ్యవహరించిన ముఖ్య నేతతో పాటు ఇతర నేతలు ఇందులో కీలకపాత్ర పోషించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పేదలకు సంబంధించిన ప్లాట్లను సైతం చెరబట్టారు. వారిని ముప్పు తిప్పలు పెట్టారు. పేదలు సిపి అభిషేక్ మహంతికి ఫిర్యాదు చేయడంతో కొందరు నాయకులు, కార్పొరేటర్లపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కరీంనగర్ చరిత్రలో కబ్జాల పర్వం సంచలనం సృష్టించింది. దీంతో పాటు అనేక ఫిర్యాదులు భూకబ్జాలపైనే వస్తున్నాయి.హైదరాబాదులో ఏర్పాటు చేసిన హైడ్రాలాగా కరీంనగర్లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు కాడ్రా (కరీంనగర్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఆసెట్ ప్రొడక్షన్ ఏజెన్సీ) ని ఏర్పాటు చేయాలని డిమాండ్ ప్రజల నుంచి వస్తున్నది. హైదరాబాదులో కబ్జాదారులపై పాదం మోపుతున్న హైడ్రాకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నది. కరీంనగర్లో సైతం ఏర్పాటు చేస్తే ఆక్రమణదారులకు చుక్కలు తప్పవనే సమాధానం వినిపిస్తున్నది. ఎల్ఎండి రిజర్వాయర్ సమీపంలో ఎస్సారెస్పీకి సంబంధించిన భూములు కబ్జాకు గురయ్యాయి. అదేవిధంగా భూములకు రెక్కలు రావడంతో కరీంనగర్ తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో చెరువులు, కుంటల్లో ప్రభుత్వ భూములను సైతం గత పాలనలో చెరబట్టారు. పేదల ఇండ్లను సైతం ధ్వంసం చేసిన ఘటనలు కరీంనగర్ లో ఉన్నాయి. పైసా పైసా కూడబెట్టుకొని పేదలు ఇళ్ల స్థలాలు కొనుక్కుంటే వారివి సైతం కబ్జా చేశారు. తిరిగి వారి పైన కేసులు పెట్టి జైలు పాలు చేశారు. వీటి విరుగుడుకు కరీంనగర్లో కాడ్రా ఏర్పాటు చేయాలని, దీంతో అటు ప్రభుత్వ భూములు ఇటు సామాన్యుల భూములకు రక్షణ ఉంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల్లో కొంత ధైర్యం కల్పించిన వారవుతారని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి ఇదే అంశంపై ఆదివారం ఒక ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రుల సహకారంతో కరీంనగర్ లో కాడ్రా ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇది మంచి నిర్ణయం ప్రజలు స్వాగతించి తీరాల్సిందే.. ఏది ఏమైనా హైడ్రా కరీంనగర్ లోను ప్రకంపనలు సృష్టించే అవకాశం ఉంది. కాడ్రా ఏర్పడితే మాత్రం అక్రమార్కులా వెన్నులో వణుకు పుట్టే అవకాశం ఉంది. చూద్దాం మరి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో కొద్దిరోజులు వెయిట్ చేయాలి మరి..

## ఆసుపత్రుల్లో మందుల కొరతపై హరీష్ రావు ఫైర్..

**హైదరాబాద్ :** ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కు అయిన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి కాంగ్రెస్ పాలనలో అనాథగా మారిందని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో నిత్యం వేలాదిమందికి వైద్యసేవలు అందించే ఆసుపత్రి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నదని వాపోయారు. ఆసుపత్రిలో మందుల కొరత కారణంగా రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందులు లేవని చేతులెత్తేయడంతో చేసేది లేక రోగులు ప్రైవేటు ఫార్మసీలకు వెళ్లి డబ్బులు చెల్లించి మందులు కొనుగోలు చేస్తున్నారన్నారు. మూడు నెలల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించ్చారు. ఒక్క ఎంజీఎం ఆసుపత్రే కాదు దాదాపు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు నిండుకున్నాయని ఆరోపించారు.

## స్కూళ్ళలో ఇకపై తప్పనిసరిగా స్పోర్ట్స్ పీరియడ్

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్ :** ప్రభుత్వ ప్రయివేటు విద్యా సంస్థల్లో తప్పనిసరిగా ఒక స్పోర్ట్స్ పీరియడ్ ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు.జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన ఉద్యోగుల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడిన డిప్యూటీ సీఎం. ప్రపంచ స్థాయి క్రీడా పోటీల్లో తెలంగాణకు ప్రాతినిధ్యం పెరిగేలా స్పోర్ట్స్ యూని వర్సిటీని ఏర్పాటు చేస్తున్నా మన్నారు.హైదరాబాద్ లో ప్రసిద్ధ క్రీడా పోటీలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని నిర్వహణ కోసం అవకాశం ఇవ్వాలని ఇటీవలే కేంద్ర క్రీడాశాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశామన్నారు.క్రీడలకు నిధుల కొరత లేదని అవసరాలకు తగిన విధంగా నిధులు కేటాయిస్తా మన్నారు. క్రీడల ద్వారా వచ్చే స్ఫూర్తి జీవితానికి ఎంతో ఉపయోగపడుతుం దన్నారు.గత పాలకుల నుంచి వచ్చి న క్రీడా సముదాయాలను, ఆస్తులను మరమ్మతులు చేసి అభివృద్ధి చేయబో తున్నట్లు వెల్లడించారు. ఉప ముఖ్యమంత్రి మంత్రి బట్టి విక్రమార్క అన్నారు.

## అర్బన్ మండలంలో కలెక్టర్ పర్యటన



**సిద్దిపేట :** సిద్దిపేట అర్బన్ మండలంలో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి పర్యటించారు.మిట్టపల్లి గ్రామంలోని అంగన్వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాల-2 ను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా సంక్షేమ అధికారి శారద అంగన్వాడి సెంటర్లో కొత్తగా వేయించిన పెయింటింగ్ లలో కాలనిర్ణయ పట్టిక, ఫుడ్ మెను, పిల్లల సమగ్రాభివృద్ధి ఉపయోగపడే పలు చిత్రాలతో కూడిన పెయింటింగ్ లను కలెక్టర్ కి చూపించగా చాల అందంగా బాగున్నాయని అభినందించారు. ఈ సెంటర్లో 15 మంది పిల్లలను బాగ చూసుకోవాలని దానికి కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అంగన్వాడి టీచర్ కు తెలిపారు. సామ్ మామ్ పిల్లల వివరాలను అడిగారు. పిల్లలకు గవర్నమెంట్ అందించే అన్ని ఆహారాలను తప్పనిసరిగా తినే విధంగా చర్యలు తీసుకోవాలని అంగన్వాడి టీచర్, ఆయాకు తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఆశ వర్కర్లతో మాట్లాడారు గ్రామంలో డెంగ్యూ మలేరియా కేసులు ఏమైనా ఉన్నాయా అని అడగక ఇప్పటివరకు ఏమీ లేవని ఆశ వర్కర్లు కలెక్టర్ కు తెలిపారు. ఇంటింటికి పివర్ సర్వే నిర్వహించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫీవర్ వచ్చిన వారికి ఎలా తగ్గించుకోవాలో సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలిపారు. బీపీ, షుగర్లు ఉన్న వారిని రెగ్యులర్ గా కలుస్తూ ఉండి వారి ఆహార అలవాట్లను పరిశీలించి,రోజు వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపాలని సూచించారు. మందపల్లి జీపి అవాస గ్రామం అయిన పిట్టలవాడలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయడం కోసం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పిట్టల వాడలో ఇంతకుముందు 40 మంది విద్యార్థులతో అద్దే భవనంలో ప్రాథమిక పాఠశాల నడపగా అద్దే భవన యజమాని రావడంతో పాఠశాలకు ఎలాంటి భవనం లేకుండా పోయిందని పిల్లలు కొంతమంది వేరే పాఠశాలకు వెళు న్నారని, కొంతమంది బడి మానేశారని, ఇదే ప్రాంతంలో పాఠశాల కోసం ఇదివరకే కొంత ఖాళీ స్థలాన్ని కేటాయించారని జిల్లా విద్యాధికారి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా జిల్లా కలెక్టర్ తప్పనిసరిగా ఆ ఖాళీ స్థలంలో తాత్కాలిక పద్ధతిలో రెండు రూములు, మరుగుదొడ్లుతో పాఠశాల భవానన్ని నిర్మించాలని దానికి కావాల్సిన అన్ని పర్మిషన్లు, నిధులు కల్పిస్తానని ఇక్కడ నివసిస్తున్న ఏ ఒక్క విద్యార్థికి అన్యాయం జరగకుండా చూడాలని అధికారులకు తెలిపారు. ఈ పాఠశాలను యుద్ధప్రాతిపదికన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటానని విద్యార్థుల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. కెసిఆర్ నగర్ లో ప్రైమరీ స్కూల్, జడ్ పి.హెచ్.ఎస్ హైస్కూల్ ను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం డబుల్ బెడ్రూంలలో పాఠశాలను నడిపిస్తున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి ఫిజిక్స్ సబ్జెక్టు సంబంధించి ప్రశ్నలు అడుగుతూ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పై స్థాయికి వెళ్లేందుకు పదవ తరగతి అనేది గట్టి పునాదని మనకు సబ్జెక్టు మీద పూర్తి అవగాహన ఉంటేనే పరీక్షలలో రాయగలుగుతామని, ముఖ్యంగా లాంగ్వేజ్ కి సంబంధించి ఇంగ్లీష్, హిందీ, తెలుగు సబ్జెక్టులలో చదవడం కంటే రెగ్యులర్ గా మాట్లాడుతుంటే వాటి గురించి ఎక్కువగా తెలుసుకోగలుగుతామని, మాట్లాడగలుగుతామని అన్నారు. ఇటీవల నిర్వహించిన పరిక్షలో మంచి మార్కులు వచ్చిన విద్యార్థులను అభినందించారు. ప్రతి ఒక్కరు వారిని ఇన్స్పిరేషన్ గా తీసుకుని 10/10 జిపి ఎక్కవ మంది సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. కెసిఆర్ నగర్ లో ప్రైమరీ స్కూల్ కోసం కేటాయించిన 1ఎకరం ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. స్కూల్ నిర్మాణం కోసం ప్రపోజల్ పంపాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట డిఈఓ శ్రీనివాస్ రెడ్డి, అర్బన్ తహసిల్దార్ సలీం, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఆర్డీవో కార్యాలయాలను ముట్టడించిన సర్పంచులు

**నిర్మల్ :** భైంసా పట్టణంలో ఆర్డీవో కార్యాలయాన్ని సర్పంచులు ముట్టడించారు.నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులు చేసి నేటికీ బిల్లులు అందక నానా ఇబ్బందులు పడుతున్న సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, బిల్లులను విడుదల చేసిన తర్వాతే గ్రామపంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు విడుదల చేసిన తర్వాతే గ్రామపంచాయతీల ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఆర్ ఉఅండ్ విశ్రాంతి భవనం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్ళి కార్యాలయం వద్ద బైఠాయించారు. ఆర్డీవో కి వినతి పత్రం అందజేశారు.వారు మాట్లాడుతూ గ్రామాలలో అభివృద్ధి అనే ఆకాంక్షతో వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు మొదలగు అనేక కార్యక్రమాలు విడతల వారీగా చేపట్టి ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దడంలో సర్పంచుల పాత్ర కీలకమని వారు తెలిపారు. ఎంతో కష్టపడి గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన సర్పంచుల బిల్లుల చెల్లింపుల్లో గత ప్రభుత్వం, తాజా ప్రభుత్వాలు జాప్యం చేస్తూ సర్పంచులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వారన్నారు. పెండింగ్ బిల్లుల విషయమై ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రాలు అందించినా కాగితానికే పరిమితమయ్యాయని అన్నారు.

# పటికబెల్లంతో ఆరోగ్య ప్రయోజనాలు!



పటికబెల్లంలో ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు, అమినో ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయి. కేవలం మాంసాహారంలో దొరికే ముఖ్యమైన విటమిన్లు, విటమిన్ బి12 పటికబెల్లంలో ఎక్కువ మొత్తంలో దొరుకుతుంది.మూడు, లేదా నాలుగు దొండ పండ్లను పటికబెల్లం పొడిలో అద్దుకొని తింటూ ఉంటే దగ్గు తొందరగా తగ్గిపోతుంది. పటిక బెల్లం శరీరానికి త్వరిత శక్తిని అందిస్తుంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ పటిక బెల్లం తినడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. వేడివేడి పాలల్లో పటికబెల్లం పొడి కలిపి రెండు లేక మూడు పూటలు తాగితే గొంతు బొంగురు తగ్గిపోతుంది. పటికబెల్లం పొడి అరస్పూను, పుదీనా ఆకుల రసం టీ స్పూన్ కలిపి రోజూ రెండు లేక మూడు పూటలు సేవిస్తూ ఉంటే దద్దుర్లు తగ్గుతాయి. పటిక బెల్లంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక శక్తిని పెంచి, వ్యాధుల నుంచి రక్షిస్తాయి. తరుచు జలుబు, దగ్గు వంటి సమస్యలు తగ్గుతాయి. వాత, పిత్త, కఫ దోషాల వల్ల కలిగే అనేక రోగాలకు పటికబెల్లం ఔషధంగా పనిచేస్తుంది. పటికబెల్లం కంటి చూపుకి బాగా పని చేస్తుంది. భోజనం తరువాత చిన్న పటిక బెల్లం ముక్క నోట్లో పెట్టుకుంటే కంటికి మంచిది. అరటిపండును పటికబెల్లం పొడితో అద్దుకొని తింటూ ఉంటే నీళ్ల విరేచనాలు తగ్గుతాయి. పటిక బెల్లంలో ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల రక్తహీనతను తగ్గించడంలో సహాయపడుతుంది. మహిళలు పటిక బెల్లం తినడం వల్ల పీరియడ్స్‌లో వచ్చే సమస్యలు తగ్గుతాయని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. ఎండాకాలంలో పటికబెల్లం పొడిని నీటిలో వేసుకుని తాగితే అతి దాహం తగ్గడంతో పాటు వడదెబ్బ తగలదు. ఒక్కోసారి అనుకోకుండా ముక్కులోంచి రక్తం వస్తుంది. దీంతో వెంటనే పటికబెల్లం కలిపిన నీటిని బాధితుడికి ఇస్తే రిలీఫ్ లభిస్తుంది. పటిక బెల్లం మగవారిలో వీర్యం క్వాలిటీని మెరుగు పరుస్తుంది. పటికబెల్లం ముక్కను కొద్దిగా నీళ్లతో అరగదీయగా వచ్చిన ఆ గంధాన్ని తేలు కుట్టిన చోట రాసి మర్దన చేస్తూ ఉంటే 6 నిమిషాల్లో తేలు విషం హరించబడుతుంది. పటిక బెల్లం జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇది మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీని పాలతో కలిపి కూడా తీసుకోవచ్చు. పటిక బెల్లంలో ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల రక్తహీనతను తగ్గించడంలో సహాయపడుతుంది. మహిళలు పటిక బెల్లం తినడం వల్ల పీరియడ్స్‌లో వచ్చే సమస్యలు తగ్గుతాయని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. కాల్షియం అధికంగా ఉండటం వల్ల ఎముకలను బలపరుస్తుంది. కీళ్ళ, నడుము నొప్పితో బాధపడేవారు కూడా ఈ పటిక బెల్లం తినడం వల్ల బోలెడు లాభాలు కలుగుతాయి. మార్కెట్‌లో లభించే ఫేస్ క్రీముల కంటే ప్రతిరోజు పటిక బెల్లం చర్మాన్ని మెరిసేలా చేసి, ముడతలు పడకుండా కాపాడుతుందని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు.

# నానబెట్టిన బాదంపప్పు తిని తొక్కలు పడేస్తున్నారా?



బాదంపప్పులాగే వాటి తొక్కలు కూడా మన శరీరానికి కావాల్సిన అనేక పోషకాలను అందిస్తాయి. ఈ పీల్స్‌లో విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్స్ వంటి లక్షణాలు ఉంటాయి.ఇది చర్మం, జుట్టుకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కొన్ని పరిశోధన ప్రకారం బాదం తొక్కలలో పుష్కలంగా పాలీఫెనాల్స్ కలిగి ఉంటాయి. ఇది మీ కంటి చూపును, జ్ఞాపకశక్తిని పెంచుతుందని చెబుతున్నారు నిపుణులు. షార్ట్ టర్మ్ మెమరీ లాస్‌కి కూడా ఇది మంచి పరిష్కారం అంటున్నారు నిపుణులు.బాదం తొక్కలలో ఉండే పాలీఫెనాల్స్ రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. టైప్ 2 డయాబెటిస్‌లో ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడంలో పాలీఫెనాల్స్ సహాయపడతాయి. ఇది గుండెల్లో వచ్చే దీర్ఘకాలిక మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. దీనితో పాటు పాలీఫెనాల్స్ ఆరోగ్యకరమైన కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడతాయి. శరీరంలో రక్తం గడ్డకట్టడం అనేది తీవ్రమైన అనారోగ్య సమస్య. దీని వల్ల రక్తప్రసరణ ఆగిపోయి గుండెపోటు, పక్షవాతం వచ్చే అవకాశం ఉంది. కానీ పాలీఫెనాల్స్ రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఇటీవలి అధ్యనాల ప్రకారం.. పాలీఫెనాల్స్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయని సూచించాయి. వీటిలో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి క్యాన్సర్ నుండి రక్షిస్తాయి. బాదం తొక్కలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇందులో ఫ్లేవనాయిడ్స్ కూడా ఉన్నాయి. ఇవి పేగులో మంచి బ్యాక్టీరియాను ప్రోత్సహిస్తాయి. బాదం తొక్కలు, గుమ్మడికాయ గింజలతో పొడిని తయారు చేసుకుని గోరువెచ్చని పాలలో కలిపి తీసుకుంటే..మలబద్ధకం సమస్య నుంచి బయటపడవచ్చు. బాదం తొక్కలతో హెయిర్ మాస్క్‌ని కూడా తయారు చేసుకోవచ్చు. దీని కోసం, 1/2 కప్పు బాదం తొక్క, 1 గుడ్డు, 1 టేబుల్ స్పూన్ కొబ్బరి నూనె, 2 టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, తేనె కలిసి ప్యాక్‌కి కావాల్సిన మిశ్రమాన్ని తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు అంతటికి బాగా పట్టించి సుమారు బాగా ఆరనివ్వాలి. ఆ తరువాత శుభ్రమైన నీటితో వాష్ చేసుకోవాలి. దీంతో మీకు ఇంట్లోనే హెయిర్ స్పా చేసుకున్నంత షైన్ వస్తుంది. దీంతో మీ జుట్టు ఆరోగ్యానికి కావాల్సిన విటమిన్ ఇ లక్షణాలను పుష్కలంగా కలిగి ఉంది.


# పెరుగు పుల్లగా మారిందా?



పెరుగు వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు. పెరుగు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. పెరుగు అనేక వ్యాధుల నుంచి రక్షిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ప్రతిరోజూ ఒక గిన్నెడు పెరుగు తీసుకుంటే.. అంతకు మించిన ఔషధం మరొకటి లేదంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇంట్లో తయారుచేసిన పెరుగు ఆరోగ్యానికి ఉత్తమమైనది. కానీ ఇంట్లో తయారు చేసిన పెరుగు ఎక్కువ కాలం నిల్వ చేయడం సాధ్యం కాదు. వెంటనే పాడై పోతుంటుంది. దాంతో మార్కెట్‌లో దొరికే పెరుగుపైనే ఆధారపడవల్సి వస్తుంది. కానీ సమస్య ఏమిటంటే.. పెరుగును ఎక్కువ కాలం నిల్వ ఉంచితే దాని రుచి, పోషక విలువలు కూడా పోతాయి. పెరుగును ఎక్కువసేపు ఉంచితే దాని రుచి మరింత పుల్లగా మారుతుంది. అస్సలు తినలేం. అప్పుడు పెరుగును పారేయడం తప్ప వేరే మార్గం లేదు. ఇలా కాకుండా ఉండాలంటే ఈ చిట్కా ట్రై చేయండి. పెరుగులోని అదనపు పులుపుని తొలగించడానికి పెరుగు నుంచి నీటిని తొలగించాలి. పెరుగులో నీటిశాతం ఎక్కువగా ఉన్నప్పుడే వడకట్టాలి. తర్వాత మళ్లీ అందులో చల్లటి నీళ్లు పోసి చెంచాతో నెమ్మదిగా కలుపుతూ ఉండాలి. పెరుగును నీటితో కలుపుతున్నప్పుడు, పెరుగు మీగడ కరగకుండా జాగ్రత్త పడాలి. తర్వాత స్టయినర్ సహాయంతో పెరుగును వడకట్టి నీటిని వేరు చేయాలి. పెరుగు నుంచి నీరు బయటకు తీసిన తర్వాత ఒక గిన్నె నిండా చల్లని పాలు అందులో పోయాలి. అనంతరం పెరుగును 2-3 గంటలు అలాగే వదిలేయాలి. పెరుగు మొత్తాన్ని బట్టి పాలను వాడాలి. ఈ చిట్కా పెరుగులోని అదనపు పులుపును తొలగిస్తుంది.

# గురక సమస్యతో బాధపడుతున్నారా?

జీవనశైలి మార్పులతో పెరుగుతున్న అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా సమస్యకు చికిత్స అందించేందుకు నిమ్స్‌లో ప్రత్యేక ల్యాబ్ సిద్ధమవుతుంది. గురక సమస్యతో బాధపడేవారికి ఈ ల్యాబ్‌లో చికిత్స అందించనున్నారు వైద్యులు. ముఖ్యంగా అధిక బరువు, డ్రింక్, సిగరెట్ అలవాట్లు, శ్వాసనాళ్లలో సమస్య అంటే స్లీప్ అప్నియా అంటే గురకకు దారి తీస్తుంది అని నిపుణులు అంటున్నారు. మరి నిమ్స్‌లో ఈ స్లీప్ అప్నియాకు ఎలాంటి వైద్యం అందించనున్నారో ఇప్పుడు తెలుసుకుందామా.. గ్రేటర్ వ్యాప్తంగా 40 నుంచి 50 శాతం వరకు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని లెక్కలు చెబుతున్నాయి. ఈ సమస్య ఉన్నవారు కొన్నిసార్లు శ్వాస ఆగిపోయి ఆకస్మాత్తుగా మెలకువ రావడం.. మళ్లీ పడుకున్న కాసేపటికి అదే పరిస్థితి రిపీట్ అవ్వడం లాంటివి జరుగుతాయని వైద్యులు చెబుతున్నారు. దీని కారణంగా మెదడుకు ఆక్సిజన్ అందక పక్షవాతం బారిన పడే ముప్పు ఉంటుందన్నారు. ఈ గురకతో గుండె స్పందన రేటు కూడా తగ్గుతుందని.. మహిళల కంటే పురుషులలో ఎక్కువ శాతం ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని.. 30 ఏళ్లు దాటిన అధిక శాతం మందిలో ఇది ఎక్కువగా కనిపిస్తుందని చికిత్స పొందుతే చాలావరకు సమస్యకు దూరంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. స్లీప్ అప్నియా బాధితులను 24 గంటల పాటు ల్యాబ్‌లో ఉంచివారి నిద్రపై అధ్యయనం చేస్తారు. రోగి నిద్రిస్తున్న సమయంలో గుండె, ఊపిరితిత్తులు, మెదడు కార్యకలాపాలు, శ్వాస విధానాలు, చేయి, కాలు కదలికలు, రక్తంలో ఆక్సిజన్ స్థాయిలను పరిశీలిస్తారు. ఈ పరీక్షనే పాలీ సోమ్నోగ్రాఫీ అంటారు. స్లీప్ అప్నియాను మూడు రకాలుగా విభజించి సమస్యను విశ్లేషించి రోగికి చికిత్స అందిస్తారు.





# రోజు 2 అరటిపండ్లు తింటే ఇన్ని లాభాలా?

అరటిపండును ఇష్టపడని వారు ఈ ప్రపంచంలో ఎవరూ ఉండరు. అరటిపండ్లు రుచిలోనూ, ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తాయి. అరటిపండు తినడం వల్ల శరీరంలోని అనేక రకాల వ్యాధులను దూరం చేసుకోవచ్చు. ప్రతి సీజన్‌లో లభించే అరటిపండు శరీరానికి మేలు చేస్తుంది. అరటిపండులో విటమిన్ బి6, విటమిన్ సి, ఫైబర్, మాంగనీస్ ఉంటాయి. అలాగే ఇది కొవ్వు రహిత, కొలెస్ట్రాల్ లేని పండుగా పరిగణించబడుతుంది. ఈ కారణంగా అరటిని శక్తికి కేంద్రంగా పిలుస్తారు. ఈ సందర్భంలో అరటిపండ్లు తినడం వల్ల శరీరానికి ఎలాంటి లాభాలు కలుగుతాయో చూద్దాం. ఎముకలకు బలం: అరటిపండులో ఉండే క్యాల్షియం ఎముకలను దృఢంగా ఉంచుతుంది. మెగ్నీషియం ఎముకలను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. మీరు రోజూ అరటిపండు, పాలు తీసుకుంటే మీ బలహీనమైన ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. కడుపు ఆరోగ్యం: రోజుకు రెండు అరటిపండ్లు తీసుకోవడం వల్ల ప్రేగు పనితీరు, జీర్ణక్రియ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అరటిపండులో కరిగే ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది. అలాగే కరిగే ఫైబర్ నీటిని గ్రహించి జీర్ణవ్యవస్థ ద్వారా కదిలిస్తుంది. ఇది మలబద్ధకం సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. రోజూ అరటిపండు తినడం వల్ల పొట్టలో ఉండే యాసిడ్ తగ్గిపోయి శరీరంలోని వ్యర్థాలు తొలగిపోతాయి. రోగనిరోధక శక్తి: ఇన్ఫెక్షన్, వ్యాధితో పోరాడటానికి రోగనిరోధక శక్తి అవసరం. అరటిపండులోని పోషకాలు శరీరంలో రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. అరటిపండులోని విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి సహాయపడుతుంది. ఈ విటమిన్ యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. అలాగే అరటిపండ్లు హానికరమైన ఫ్రీ రాడికల్స్ నుండి రక్షించడానికి, రోగనిరోధక వ్యవస్థలో ముఖ్యమైన పాత్ర పోషించే తెల్ల రక్త కణాల పనితీరును నియంత్రిస్తాయి. అదేవిధంగా అరటిపండులో విటమిన్ దీ6, జింక్ కంటెంట్ రోగనిరోధక వ్యవస్థకు ప్రయోజనకరంగా ఉంటాయి. మెదడు ఆరోగ్యం: అరటిపండ్లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అరటిపండ్లలో విటమిన్ దీ6 పుష్కలంగా ఉంటుంది. ఇది సంతోషకరమైన హార్మోన్లు సెరోటోనిన్, డోపమైన్‌లను విడుదల చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది మిమ్మల్ని హ్యాపీ మూడ్‌లో ఉంచుతుంది. అలాగే ఇది మంచి నిద్రను ఇస్తుంది. మెరుగైన జ్ఞానానికి దారితీస్తుంది. అరటిపండ్లలోని మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. రక్తనాళాలను రిలాక్స్ చేస్తుంది. ఇది మెదడుకు సరైన ఆక్సిజన్ అందించడం ద్వారా మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. బరువు తగ్గడం: అరటిపండులో ఫైబర్, విటమిన్లు ఉన్నందున ఇది సులభంగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అరటిపండులో క్యాలరీలు ఉండటం కారణంగా ఇది త్వరగా కడుపుని నింపుతుంది. ఎక్కువసేపు ఆకలిగా అనిపించకుండా చేస్తుంది.

# హరీష్ శంకర్ మీద రెట్టింపు ఒత్తిడి



విడుదలకు ముందు మిస్టర్ బచ్చన్ మీద అతి నమ్మకంతో ఓవర్ అటెన్షన్ తెచ్చుకోవాలని ప్రయత్నించిన హరీష్ శంకర్ అదిప్పుడు బూమరాంగ్ లా రివర్స్ కావడంతో షాక్ తిన్న వైనం బయటికి కనిపించకపోయినా అదే వాస్తవం. మిక్స్డ్ టాకని చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ బాక్సాఫీస్ తీర్పు స్పష్టంగా వచ్చేసింది. ఏదో అద్భుతం జరిగితే తప్ప ఈ వీకెండ్ కలెక్షన్ల నుంచి మేజిక్ ఆశించలేం. దానికి తోడు నిర్మాత టిజి విశ్వప్రసాద్ స్క్రిప్ట్ స్టేజిలోనే పొరపాట్లు జరిగాయని, సెకండాఫ్ లో హెచ్చుతగ్గులు ఉన్నాయని ఓపెన్ గా చెప్పేయడం జరిగిందేమిటో తేటతెల్లం చేసింది. ఇక అసలు మ్యాటర్ కొద్దాం. ప్రస్తుతం హరీష్ శంకర్ మీద రెండు ఒత్తిళ్లు ఉన్నాయి. మొదటిది ఉస్తాద్ భగత్ సింగ్. ఇదీ రీమేకే. విజయ్ తేరి తెలుగులో పోలీసోడుగా వచ్చింది. థియేటర్ లో ఆడలేదు కానీ అమెజాన్ ప్రైమ్ లో బోలెడు మంది చూసేశారు. ఇప్పటికీ అందుబాటులో ఉంది. అయినా సరే ఒరిజినల్ వెర్షన్ ని గుర్తుకరానంత గొప్పగా రీమేక్ చేస్తానని పలు సందర్భాల్లో నొక్కి వక్కాణించారు. అచ్చం మిస్టర్ బచ్చన్ కు చెప్పినట్టే. అలాంటప్పుడు ఉస్తాద్ మీద కూడా పవన్ కళ్యాణ్ అభిమానుల్లో సందేహం రావడం సహజం. షూటింగ్ ఇంకా టైం ఉంది కాబట్టి స్క్రిప్ట్ ని మరోసారి పునఃసమీక్షించుకోవడం అవసరం. రెండోది రామ్ తో ప్రాజెక్టు. ది వారియర్, స్కంద, డబుల్ ఇస్మార్ట్ రూపంలో హ్యాట్రిక్ డిజాస్టర్లు చూసిన రామ్ సెలక్షన్ పట్ల ఫ్యాన్స్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తమ హీరో ఎనర్జీని చేతులారా వృథా చేస్తున్నారని దర్శకుల మీద మండిపడుతున్నారు. ఇప్పుడీ కాంబో ఉంటుందో లేదోననే అనుమానాలు కొందరిలో తలెత్తుతున్నాయి.

# రామ్ నిర్ణయం మంచే చేయనుంది



వరసగా మూడు డిజాస్టర్లు చవిచూసిన రామ్ అభిమానులు బాగా బేజారై ఉన్నారు. డబుల్ ఇస్మార్ట్ మినిమమ్ గ్యారెంటీ హిట్టనే నమ్మకంతో ఎదురు చూస్తే అది తీవ్రంగా నిరాశపరచడం జీర్ణించుకోలేకపోతున్నారు. లైగర్ గాయాలను పూర్తిగా మాన్పుతుందనుకుంటే ఇంకా రెట్టింపు చేయడం పూరి జగన్నాథ్ ఫ్యాన్స్ ని కలవరపరుస్తోంది. మంచి సీజన్, వరస సెలవులు, పోటీలో ఉన్న మిస్టర్ బచ్చన్ ఫెయిల్యూర్ ఇలా ఎన్నో అంశాలు కలిసి వచ్చినా వాడుకోలేకపోవడం ఎవరికైనా బాధ కలిగించేదే. మాస్ మూసలో పడి దారి తప్పిన ఎనర్జిటిక్ స్టార్ రామ్ కు ఒక సానుకూలాంశం కనిపిస్తోంది. డబుల్ ఇస్మార్ట్ షూటింగ్ లో ఉండగా కథలు విని రామ్ సానుకూలంగా స్పందించింది ఇద్దరు దర్శకులకు. వాటిలో మొదటిది మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి డైరెక్టర్ మహేష్ బాబుతో. మొన్నామధ్యే లాంఛనంగా ప్రారంభమయ్యింది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ కి వెళ్లబోతోంది. రామ్ కు ఇప్పుడు సెన్సిబుల్ దర్శకుల అవసరం చాలా ఉంది. ఒకప్పటి నేను శైలజ లాంటి రొమాంటిక్ ఎంటర్ టైనర్స్ కం లవ్ స్టోరీస్ లో చూడాలని ఫ్యామిలీ ప్రేక్షకులు కోరుకుంటున్నారు. మహేష్ బాబు ఎమోషన్స్ ని ఎంత బాగా హ్యాండిల్ చేస్తాడో మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టిలో చూశాం కాబట్టి ఈసారి కూడా వినోదాత్మక చిత్రం ఆశించవచ్చు. సో రామ్ సరైన నిర్ణయం తీసుకుని సరైన ట్రాక్‌లో పడ్డాడు.



# దేవర అర్ధరాత్రి స్ట్రాటజీ అదిరింది

సరిగ్గా నెల రోజుల్లో దేవర పార్ట్ 1 విడుదల కానుంది. ఈ నేపథ్యంలో కౌంట్ డౌన్ ముప్పై రోజులు మాత్రమే ఉండటంతో అభిమానులు ప్రమోషన్లు డిమాండ్ చేస్తున్నారు. ఎలాగూ షూటింగ్ అయిపోయింది కాబట్టి దానికి అనుగుణంగానే పబ్లిసిటీ ఎలా ఉండాలనే దాని మీద టీమ్ కసరత్తులు చేస్తోంది. దర్శకుడు కొరటాల శివ మిగిలిన ప్యాచ్ వర్క్ తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులను చూసుకుంటున్నారు. అనిరుద్ రవిచందర్ విదేశాల నుంచి రాగానే రీ రికార్డింగ్ మొదలుపెట్టాల్సి ఉంటుంది. సెప్టెంబర్ మూడో వారానికి ఫస్ట్ కాపీ సిద్ధం చేసి సెన్సార్ కు పంపాలి. లేదంటే చాలా ఒత్తిళ్లు తలెత్తుతాయి. ఇదిలా ఉండగా దేవర బెనిఫిట్ షోలకు సంబంధించి ఒక కీలక నిర్ణయం జరిగినట్టు లేటెస్ట్ అప్డేట్. ఓవర్ సీస్ తో పాటు ఇండియాలోనూ ఒకే సమయంలో మొదటి ఆట పడేలా అర్ధరాత్రి ఒంటి గంటకు ముహూర్తం నిర్ణయించినట్టుగా తెలిసింది. దీని వల్ల ఓవర్సీస్ రిపోర్ట్స్, ఇక్కడి రివ్యూస్ మ్యాచ్ అయ్యే అవకాశం ఉంటుంది. లేదంటే యుఎస్ టాక్ తీసుకుని సోషల్ మీడియాలో దాన్ని నెగటివ్ గా ప్రచారం చేసే అవకాశం లేకపోలేదు. ఒకరకంగా ఇది తెలివైన స్ట్రాటజీ. అమెరికాలో ఎన్ఆర్ఐ ప్రీమియర్ చూస్తున్నపుడే అనకాపల్లిలో తారక్ ఫ్యాన్ ఇక్కడ ఎంజాయ్ చేస్తుంటాడు. సో ఒక రకంగా తెలివైన గేమ్ ఇది. అలా అని రిస్క్ లేకుండా పోలేదు. తెల్లవారకుండానే పూర్తి టాక్ బయటికి వస్తుంది. పాజిటివ్ అయితే టికెట్లు దొరకడం దుర్లభమే. దీనికి తోడు పగటి పూట షోలలో కోత వేసుకోవాల్సి ఉంటుంది.

# సీనియర్ హీరోతో రొమాన్స్‌కు రెడీ

తన ప్రతిభతో తక్కువ కాలంలోనే ఉన్నత స్థాయికి ఎదిగిన హీరోయిన్స్‌లో ఐశ్వర్య రాజేష్ ఒకరు. నటి ఐశ్వర్య రాజేష్ ప్రస్తుతం తమిళ చిత్రసీమలో హీరోయిన్ గా మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ అమ్మడు.ల్లో తన ప్రతిభతో తక్కువ కాలంలోనే ఉన్నత స్థాయికి ఎదిగిన హీరోయిన్స్‌లో ఐశ్వర్య రాజేష్ ఒకరు. నటి ఐశ్వర్య రాజేష్ ప్రస్తుతం తమిళ చిత్రసీమలో హీరోయిన్ గా మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ అమ్మడు. నటుడు దినేష్ హీరోగా బా.రంజిత్ దర్శకత్వంలో తెరకెక్కిన 'అట్టకత్తి' లో చిన్న పాత్రతో నటిగా తెరంగేట్రం చేసింది ఐశ్వర్య రాజేష్. లో ఆయన ఉద్వేగభరితమైన ప్రసంగం అభిమానులను ఆకట్టుకుంది. తెలుగు ప్రేక్షకులకు కూడా ఐశ్వర్య రాజేష్ సుపరిచితురాలే.. ఈ అమ్మడు నటించిన లు తెలుగులో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 2018లో అరుణ్‌రాజా కామరాజ్ దర్శకత్వంలో శివకార్తికేయన్ హీరోగా ఐశ్వర్య రాజేష్ నటించిన చిత్రం 'కనా'. ఇదే తెలుగులోనూ రీమేక్ అయ్యింది. హీరోయిన్ సెంట్రిక్ కథలను ఎంచుకుని నటిస్తూ ఉంది ఈ అమ్మడు. ఈ అమ్మడి చివరి చిత్రం పులిమాడ. కరుప్పర్ నగరన్, మోహన్ దాస్, తీవర్ గులై నడుంగ వంటి తదుపరి చిత్రాలు విడుదల కానున్నాయి. వీటితోపాటు ఇప్పుడు ఈ అమ్మడు ఓ సీనియర్ హీరోతో రొమాన్స్ కు రెడీ అయ్యింది. ఆయనే వెంకటేష్. వెంకటేష్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తోన్న లో ఐశ్వర్య రాజేష్ వెంకీ భార్యగా నటిస్తుంది. ఇటీవలే ఈ ఇద్దరి పై ఓ రొమాంటిక్ సాంగ్ ను షూట్ చేశారు.





# సూపర్ హిట్ మూవీకి సీక్వెల్

కీరవాణి చిన్న కొడుకు సింహా హీరోగా పరిచయం అయిన సినిమా.. మత్తు వదలరా. ఇది టాలీవుడ్లో ఒక స్పెషల్ ఫిలింగా నిలిచిపోయింది. ఒక మూసలో సాగే థ్రిల్లర్ మూవీస్‌కు భిన్నంగా.. సరికొత్త కాన్సెప్ట్‌తో హాలీవుడ్ శైలిలో ప్రేక్షకులను థ్రిల్ చేసింది. అరంగేట్రంలోనే ఇలాంటి మంచి థ్రిల్లర్‌తో మెప్పించాడు రితీష్ రాణా. ఇదే సినిమాతో సింహానే కాక నరేష్ అగస్త్య అనే మరో టాలెంటెడ్ నటుడు కూడా తెలుగు తెరకు పరిచయం అయ్యాడు. ఐతే ఈ చిత్రం తర్వాత తనపై పెరిగిన అంచనాలను రితీష్ అందుకోలేకపోయాడు. తన రెండో సినిమా 'హ్యాపీ బర్త్ డే' నిరాశపరిచింది. దీంతో తర్వాత తన పేరు వినిపించలేదు. ఐతే కొంచెం గ్యాప్ తీసుకుని అతను తన అరంగేట్ర చిత్రానికి సీక్వెటల్ తీస్తున్నాడు. దీని గురించి ఈ రోజే సమాచారం బయటికి వచ్చింది. 'మత్తు వదలరా'ను నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్టైన్మెంట్స్ సంస్థలే ఈ చిత్రానికి సీక్వెల్ అనౌన్స్ చేశాయి. దీని ప్రి లుక్ చాలా ఆసక్తికరంగా కనిపిస్తోంది. దొంగతనం కాదు, తస్కరించుట అంటూ తాము చేసే పనికి సంస్కారవంతమైన పేరు పెట్టుకుని వస్తున్నారు 'మత్తు వదలరా' జోడీ సింహా–సత్య. వీళ్లు ప్రొఫెషనల్ దొంగలుగా సెలక్ట్ అయిన విషయాన్ని ప్రి లుక్‌లో చూపించారు. మిగతా కాస్ట్ అండ్ క్రూ గురించి ఏమీ వెల్లడించలేదు కానీ.. 'మత్తు వదలరా'కు పని చేసిన వాళ్లే చాలామంది ఇందులోనూ భాగమై ఉంటారని భావించవచ్చు. రెండో సినిమాతో దెబ్బ తిన్న రితీష్ రాణా ఈసారి కసితో పని చేస్తాడనడంలో సందేహం లేదు. 'మత్తు వదలరా' తర్వాత సింహా సైతం వరుసగా ఫెయిల్యూర్లు ఎదుర్కొన్నాడు. ఒక్క సినిమా కూడా ఆకట్టుకోలేదు.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918